విశాలాంధ్ర

వైఎస్ఆర్ కడప జిల్లా | అన్నమయ్య జిల్లా

మంగళవారం, 7 అక్టోబర్ 2025 | 8 పేజీలు

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

విశాలాంధ్ర-రాయచోటి: పిజిఆర్ఎస్ అర్జీలకు అధికారులు నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో నాణ్యతతో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రసెల్ సిస్టం-పిజిఆర్ఎస్) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు.

..మిగతా 2లో

వైకాపా, కూటమి.. రాష్ట్రానికి రాహు కేతువులు

- కూటమి పాలనలో విద్యావ్యవస్థ అస్తవ్యస్తం
- రైతుల పరిస్థితి దయనీయం
- శాంతి భద్రతల పరిస్థితి అధ్వాన్నం
- డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి

..మిగతా 2లో

నాణ్యమైన పరిష్కారం చూపాలి: కలెక్టర్

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా స్వీకరించిన అర్జీలకు అర్జీదారులు సంతృప్తి చెందేలా నాణ్యమైన పరిష్కారం అందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పాత పిజిఆర్ఎస్ సమావేశ హాలు నందు.. ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి తోపాటు జాయింట్ కలెక్టర్ అదితి సింగ్, డిఆర్వో విశ్వేశ్వర నాయుడు, అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

..మిగతా 2లో

సంక్షోభంలో వ్యవసాయం

- సీమలో గడ్డు పరిస్థితులు
- దాపురించిన తీవ్ర పరిస్థితులు
- ప్రత్యామ్నాయ పంటలపై రైతుల అనాసక్తి
- అరకొర సమావేశాలతో మమ అనిపిస్తున్న అధికారులు



రాయలసీమ జిల్లాలోని ముఖ్యంగా పీలేరు, కడప, నంద్యాల, అనంతపురం, ప్రాంతాల రైతులు తీవ్ర సంక్షోన్ని ఎదురుకుంటున్నారు.ఉల్లి, అరటి, చినీ తో పాటు కర్నూలు జిల్లాలో ప్రధాన పంట ప్రత్తి, నంద్యాల జిల్లాలో ఎక్కువ సాగు జరిగిన మొక్క జొన్న రైతులు పూర్తి సంక్షోభం ఎదుర్కొంటున్నారు. అనావృష్టితో అనంతపురం, సత్య సాయి, అన్నమయ్య, కడప జిల్లాలు సంక్షోభం అయితే అతి వృష్టి తో కర్నూలు, నంద్యాల జిల్లాలు ఇబ్బంది పడుతున్నారు. – విశాలాంధ్ర-పీలేరు

..మిగతా 2లో

ఎవ్వరూ ఆందోళన చెందవద్దు..

- రానున్నవి మనకు మంచి రోజులే
- ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: వైకాపా కార్యకర్తలు గాని ప్రజలు గాని, అభిమానులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని రానున్నవి మనకు మంచి రోజులేనని కడప ఎంపీ వైయస్ అవినాష్ రెడ్డి వైకాపా అభిమానులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఎంపీ తన నివాసంలో ప్రజా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రజల వినతులను స్వీకరించి అనంతరం వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎవరు కూడా అధైర్య పడవద్దని అందరి సమస్యలను పరిష్కరిస్తానని ఆయన భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపి మాట్లాడుతూ గత 15 నెలల కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ఘోరంగా విఫలమైందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలోనే అన్నమయ్య జిల్లా మొలకలచెరువులో నకిలీ మద్యం తయారీలో కూటమి ప్రభుత్వం అండదండలతోనే రాష్ట్రవ్యాప్తంగా మద్యం షాపులకు నకిలీ మద్యాన్ని సరఫరా చేయడం లేదా అని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు? కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యాన్ని తయారుచేసిన? విక్రయించిన? ఎంతటి వారి పైన కఠిన చర్యలు తీసుకుంటామని

..మిగతా 2లో

ఆధ్యాత్మిక శిఖరాగ్ర గౌరవానికి ప్రతీక వాల్మీకి మహర్షి

- నేడు వాల్మీకి మహర్షి జయంతి

విశాలాంధ్ర-లింగాల: దేశవ్యాప్తంగా మంగళ వారం వాల్మీకి మహర్షి జయంతి ఘనంగా జరుపుకోనున్నారు. ఆదికవి, మహర్షి, ఆధ్యాత్మిక శిఖరాగ్ర గౌరవానికి ప్రతీక అయిన వాల్మీకి, తన కలం ద్వారా ప్రపంచానికి అమూల్యమైన రామాయణం అనే మహాకావ్యాన్ని అందించారు. ప్రజలు కీర్తించేది కేవలం ఆయన రచనకే కాదు, ఆయన జీవన మార్పుకే. ఒకప్పుడు దొంగగా జీవించి, “మర మంత్రం” జపం ద్వారా “రామ” నామస్మరణలో లీనమై మహర్షిగా మారిన వాల్మీకి, భగవంతుని నమ్మకం, ఆచరణతో మనిషి జీవితాన్ని ఎలా మారుస్తాడో సాక్షాత్కరించి చూపించారు. దేశ వ్యాప్తంగా ఈ రోజున వాల్మీకి ఆశ్రమాలు, దేవాలయాలలో ప్రత్యేక పూజలు, హెూమాలు నిర్వహిస్తున్నారు. సాహిత్య సంఘాలు, పాఠశాలలు, విద్యాసంస్థలు ఆయన స్ఫూర్తిదాయక బోధనలను స్మరించుకుంటూ సదస్సులు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. చిన్నారులకు వాల్మీకి జీవితం ఆధారంగా కథలు చెప్పడం ద్వారా సన్మార్గం వైపు నడిపిస్తున్నారు. వాల్మీకి వాక్యం “ధర్మం ఎప్పుడూ గెలుస్తుంది, సత్యం



ఎప్పటికీ నిలుస్తుంది. నేటికీ సమాజానికి మార్గదర్శక వాక్యంగా నిలుస్తోంది. ఓమహర్షి వాల్మీకి ఎవరు? వల్మీకము (పుట్ట) నుండి వెలుపలికి వచ్చిన వారు కావున వాల్మీకి. రామరామ అని తపస్సుచేసిన వారు కావున మహర్షి, రాముడి జీవితచరిత్రను రామాయణముగా మహాకావ్యరచన గావించి నవాడిగా ఆదికవి అయ్యారు.

..మిగతా 2లో

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ రామగోపాల్‌రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామగోపాల్‌రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్సీ నివాసంలో సాంఘిక సంక్షేమ శాఖ పరిధిలోని పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు కలిసి తమ ప్రధాన సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. పార్ట్‌టైమ్ ఉపాధ్యాయులు ముఖ్యంగా తమ సర్వీసును పార్ట్‌టైమ్ నుండి కాంట్రాక్ట్‌గా మార్చాలని, అలాగే పెరిగిన ధరలకు అనుగుణంగా తమ జీతాలను గణనీయంగా పెంచాలని కోరుతూ తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డికి సమర్పించారు. దీర్ఘకాలంగా పరిష్కారం కాని తమ సమస్యల కారణంగా తాము ఎదుర్కొంటున్న ఆర్థిక ఇబ్బందులను, వారు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకువెళ్లారు. ఉపాధ్యాయులు వివరించిన సమస్యలను రామగోపాల్ రెడ్డి సావధానంగా విన్నారు.

పరామర్శ

విశాలాంధ్ర-లింగాల: మండలంలోని కోమ నూతల గ్రామానికి చెందిన కిరణ్‌కుమార్ రెడ్డి ఇటీవల అనారోగ్య కారణాలతో మృతి చెందారు. పులివెందుల టీడీపీ ఇంచార్జ్ మా రెడ్డి రవీంద్రనాథ రెడ్డి సోమవారం కిరణ రెడ్డి ఇంటికి వెళ్లి కిరణ్‌రెడ్డి తండ్రి లక్ష్మీ నారాయణరెడ్డి, సోదరుడు నవీన్‌రెడ్డి, కుటుంబ సభ్యులను బిటెక్ రవితో పాటు టిడిపి మండల ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవ రెడ్డి, మండల కన్వీనర్ విశ్వనాథ రెడ్డి, వేంపల్లి మండల పరిశీలకుడు అజ్జుగుట్టు రఘునాథ రెడ్డి పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకులకు గాయాలు

విశాలాంధ్ర-లింగాల: రోడ్డు ప్రమాదంలో ఇరువురు యువకులకు గాయపడిన సంఘటన లింగాల మండలం కర్ణపాపయపల్లె సమీపంలో సోమవారం చోటు చేసుకుంది. ఈ ప్రమాద సంఘటనకు సంబంధించి ఏఎస్ఐ శేషయ్య కథనం మేరకు వివరాలిలావున్నాయి. అనంతపురం జిల్లా తిమ్మంపల్లికి చెందిన కేతిరెడ్డి యోగానంద రెడ్డి (22), కుళ్లాయప్ప (18) ద్విచక్ర వాహనం పై పులివెందుల వైపు వెళ్తుండగా, ఎదురుగా వచ్చిన ప్యాసింజర్ ఆటో రెండు ప్రమాదవశాత్తు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో యోగానంద రెడ్డి చేయి విరగ్గా, కుళ్లాయప్ప కాలుకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు వెంటనే గాయపడిన వారిని పులివెందుల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రమాదంపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు ఏఎస్ఐ తెలిపారు.

సమస్యల పరిష్కారానికి కృషి

మొదటి పేజీ తరువాయి

సామాజిక సంక్షేమ రంగంలో ఉపాధ్యాయులు అందిస్తున్న సేవలను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పార్ట్‌టైమ్ ఉపాధ్యాయుల సమస్యలు న్యాయబద్ధమైనవని అంగీకరించి, ఈ సమస్యల పరిష్కారం కోసం తక్షణమే సంబంధిత మంత్రి దృష్టికి ఈ అంశాలను తీసుకువెళ్తానని, త్వరలో పరిష్కారం మయ్యేలా తనవంతు కృషి చేస్తానని ఉపాధ్యాయులకు భరోసా ఇచ్చారు.

నాణ్యమైన పరిష్కారం చూపాలి: కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయికి స్వయంగావెళ్లి క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి, అర్జీదారుడు సంతృప్తి చెందేలా నిర్ణీత గడువులోపు తప్పనిసరిగా పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లేకుండా రీఓపెన్ కాకుండా జాగ్రత్త వహించాలని అధికారులకు సూచించారు. క్రింది స్థాయి అధికారులను పంపకుండా స్వయంగా అధికారే వెళ్లాలని అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలను పరిష్కరించాలన్నారు. వివిధ శాఖల జిల్లా అధికారులతో పిజిఆర్ ఎస్ పెండింగ్ అర్జీలపై సమీక్ష చేశారు. అనంతరం అర్జీదారుల నుండి వారు అర్జీలను స్వీకరించారు. ఎస్డీసి వెంకటపతి, జడ్పీ సీఈఓ ఓబులమ్మ, మెప్మా పీడీ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయం

మొదటి పేజీ తరువాయి

ఆగస్టులో కురిసిన అధిక వర్షాలకు ఉల్లి, మినుము, వేరుశనగ దెబ్బ తింటే సెప్టెంబర్‌లో కురిసిన అధిక వర్షాలకు ప్రత్తి, మొక్క జొన్న రైతులు తీవ్రంగా నష్ట పోయారు.

ఆకాశాన్నంటుతున్న ప్రభుత్వ ప్రకటనలు

ఒక్క రైతునూ నష్ట పోనివ్వంకానీ క్షేత్ర స్థాయిలో ప్రతి రైతు కంట కన్నీరే ఉల్లితో మొదలైన సంక్షోభంలో మరో పంట ప్రత్తి, మొక్క జొన్న కలిసింది. గత సీజన్ మిర్చి రైతుల సంక్షోభంతో మొదలు, పొగాకు, మామిడి..ఈ సీజన్ ఉల్లి రైతుల నుండి..అరటి, చీనీ, టమాటా.. నెల్లూరులో ధాన్యం రైతుల పరిస్థితి అదే..మరల కర్నూలు జిల్లాలో ప్రతి రైతుల పరిస్థితి..ఇక ఉల్లి విషయంలో కిలో రూ.12 కొంటామన్నారు, 4 రోజులకే మరల మార్కెట్‌లో అమ్ముకొండి రూ.12 కంటే తక్కువకు అమ్ముకున్న వాళ్లకు ఆ డిఫరెన్స్ డబ్బులు చెల్లిస్తామన్నారు. మరల ఇప్పుడు మీరు ఎక్కడైనా అమ్ముకొండి హెక్టర్‌కి రూ.50,000 చెల్లిస్తామని అంటున్నారు. వ్యవసాయ మంత్రి ప్రకటన ఉల్లి 45,000 ఎకరాలలో సాగు జరిగింది. షుమారుగా 100 కోట్లు అవుతుంది అని ప్రకటించారు.4 రోజులు 12 రూ కొన్న రైతులకు ఈ రోజుకు ఒక్క రూపాయి చెల్లించలేదు కానీ వాస్తవంగా జరిగిన సాగు..

కర్నూలు 45,200 ఎకరాలు
కడప 11,600 ఎకరాలు
నంద్యాల 7,875 ఎకరాలు
అనంతపురం 630 ఎకరాలు
ఇతర జిల్లాలు 500 ఎకరాలు
అంటే మొత్తం సాగు 65,805 ఎకరాలు..

ఈ ఖరీఫ్‌లో ఉల్లి ఎక్కడ సాగు చేసినా తీవ్రంగా నష్ట పోయారు..

ఉల్లి రాయలసీమలో ఎక్కడ పండించినా అమ్మకానికి కర్నూలు మార్కెట్ యార్డ్‌కు రావలసిందే..కొద్దిగా తాడేపల్లి గూడెం మార్కెట్‌కు వస్తుంది రాష్ట్రంలో 65,800 ఎకరాలలో ఉల్లి సాగు జరిగితే సాయం 45,000 ఎకరాలకు అని ఎలా ప్రకటించారు. ఈ 45,000ఎకరాలు అనే అంచనా ఎలా వచ్చింది.. రాయలసీమ లోని సరిహద్దు 3 జిల్లాలలో కర్నూలు, నంద్యాల, కడప జిల్లాలలోనే ఎక్కువ సాగు జరిగింది.మొత్తం సాగుపై అధికార యంత్రాంగం వెంటనే ప్రకటన చెయ్యాలి. ఉల్లి రైతులు గత 50 సంవత్సరాలలో తీవ్ర సంక్షోభం ఎదుర్కొన్న 4 సంవత్సరాలలో ఈ సంవత్సరం ఒకటని రాయలసీమ లోని పెద్దలు చెబుతున్నారు. ఉల్లి పంటను సాగు చేసేది భార్య..భర్త కలిసి పొలంలో పని చేసుకునే చిన్న చిన్న రైతులు, కవులు రైతులు మాత్రమే.. పంట సాగు చేసిన 30 రోజుల లోపు ఈ క్రాప్ జరగాలి..పంట తీసేసి మార్కెట్‌కు వెళ్లిపోయినా ఇంకా ఈ క్రాప్ పూర్తి కాలేదు..ఈ నెలాఖరు వరకూ ఈ- క్రాప్ చేస్తామని ప్రకటించారు.. ఖరీఫ్ పంట ఈక్రాప్ ఖరీఫ్ సీజన్ అయిపోయిన తరువాత చేస్తారట.. దీని మూలంగా నిజమైన సాగు చేసిన చిన్న చిన్న రైతులకు అన్యాయం జరుగుతుంది.. అలా జరగకుండా చూడవలసిన బాధ్యత అధికారులపై ఉంది..ఉల్లి ఎకరానికి సరాసరి 7 నుండి 8 టన్నులు దిగుబడి వచ్చింది.. పంటకు పెట్టిన పెట్టుబడి కాకుండా..ఇప్పుడు పంట హార్వెస్ట్ చెయ్యటానికి, ట్రక్ కిరాయి, హమాలీ ఛార్జిలు, మార్కెట్‌లో కమీషన్ 2% డబ్బు చెల్లించటానికి, పంటకు ధర లేని పరిస్థితిలో అప్పు దొరకక చాలా ఇబ్బంది పడుతున్నామని తీవ్ర ఆవేదన చెందుతున్నారు.. ప్రభుత్వం ప్రకటించిన సహాయం ఉల్లి రైతులు నష్ట పోతున్న దానితో చూస్తే చాలా స్వల్పం. ఇది ఏమాత్రం కూడా వాళ్ళని సంక్షోభం నుండి బయట పడెయ్యదు.. అది కూడా ఎప్పటికి చెల్లిస్తారనేది ఇక్కడ ప్రశ్న.

రైతులు ట్రక్‌లతో ఉల్లి కాలువలలో పార బోస్తున్నారు.. 4రోజుల క్రితం ఒక రైతు ట్రక్ ఉల్లి హంద్రీ నీవా కాలవలో పార బోస్తే ఈ రోజు మరో రైతు ఆస్పరి మండలం యాటకల్లు గ్రామంలో శేఖర్ అనే రైతు ట్రక్ ఉల్లి వంకలో పార పోసిన దుస్థితి..ఇంత దుర్భర మైన పరిస్థితి ఉల్లి రైతులకు ఇదే ప్రథమం ఏమో,రాష్ట్రంలో ఈ ఖరీఫ్‌లో ప్రత్తి జరగవలసిన సాధారణ సాగు 13.05 లక్షల ఎకరాలు అయితే సాగు జరిగింది. 10.62(81%) లక్షల ఎకరాలు..ఇందులో లికర్నూలు జిల్లాలోనే సాగు చేశారు. 5.54 లక్షల ఎకరాలు 52%.సీజన్ తొల కరిలో జూన్, జులైలో కొంత వరకు మెరుగైన వర్షం కురవటం తో రాయలసీమలో ఉమ్మడి కర్నూలు జిల్లాలో సాగు మెరుగుగా జరిగింది.. కర్నూలు 94%, నంద్యాల 98%.. కర్నూలు జిల్లాలో వర్ష పాతం అనుకూలంగా ఉండటంతో 107% ప్రత్తి సాగు జరిగింది.. ఆగస్టు 8 నుండి కురిసిన అధిక వర్షాలకు మొదటి దొలుపు పూత, పింద దెబ్బ తిన్నది..ఇప్పుడు మరలా నాలుగు రోజుల నుండి కర్నూలు జిల్లాలోని అధిక వర్షాలకు మరలా అదే పరిస్థితి..

రాష్ట్రం లో ఎక్సెస్ వర్షం కురిసిన జిల్లాలు 2 అయితే అందులో కర్నూలు జిల్లా ప్లస్ 46% అధిక వర్షం నమోదైంది..

జూన్ 1నుండి సెప్టెంబర్ ఆఖరి వరకు కురవలసిన సాధారణ వర్షం 401 మి.మీ.. అయితే కురిసిన వర్షం 585 మి.మీ..ఈ పరిస్థితిలో ప్రత్తికి ప్రధాన మార్కెట్ అయిన ఆదోని మార్కెట్ యార్డ్ కు షుమారు గా 5 నుండి 6 వేల క్వింటాళ్ళు ప్రత్తి వస్తున్నట్లు తెలుస్తున్నది..

పొడుగు పింజ ప్రత్తి ప్రభుత్వ కనీస మద్దత్తు ధర క్వింటలు 8110 ప్రస్తుతం మార్కెట్ యార్డ్ లో అమ్ముతున్న ధర.కనిష్ఠ ధర 3960 గరిష్ఠ ధర 7350,,సీసీఐ సెంటర్‌లు అక్టోబర్ 1 నుండి తెరుస్తారని ప్రకటించారు, కానీ 1 వ తారీకున తెరవలేదు.. రాష్ట్రంలో రెండవ అత్యధిక సాగు జరిగిన ప్రత్తి ఉత్పత్తి దెబ్బ తిని కనీస మద్దత్తు ధర లభించక రైతులు తీవ్రంగా నష్ట పోతున్న పంటలలో లిమరో పంట ప్రత్తి కూడా తోడైనది.ఇక మొక్క జొన్న హార్వేస్టింగ్ జరుగుతున్నది..రాష్ట్రం మొత్తం మొక్క జొన్న 4 లక్షల ఎకరాలలో సాగు జరిగితే ఒక్క నంద్యాల జిల్లాలోనే 1.59 లక్షల ఎకరాలలో సాగు జరిగినది..ఈ అధిక వర్షాలకు ఈ పంట దిగుబడి నష్ట పోయే పరిస్థితి.. క్వాలిటీ పడి పోయి రైతులు నష్ట పోయే పరిస్థితి..ఎప్పుడైనా ఒక సీజన్ లో ఒకటో రెండో పంటల అమ్మకంలో సమస్యలు వస్తాయి..కానీ ఈ సీజన్‌లో మొట్టమొదటిగా మార్కెట్‌కు వచ్చే ఉల్లి తీవ్ర సంక్షోభంతో మొదలై..అరటి, చీనీ, సజ్జ, ధాన్యం, ప్రత్తి.. ప్రతి రైతూ సంక్షోభమే. ప్రభుత్వం ప్రకటనలే తప్ప..ఇంత వరకూ ఏ పంటకైనా రైతుకు చేరిన సాయం సున్నా,ఇక పంటల పూర్తి మార్కెటింగ్ మొదలయితే ఎలా ఉంటుందో..ఆలోచిస్తే చాలా ఆందోళన కలుగుతున్నది. రాయలసీమ లో రైతాంగం తీవ్ర సంక్షోభంలోకి వెళుతుంది..ప్రభుత్వ యంత్రాంగం చిత్త శుద్ధితో ఆలోచన చెయ్యవలసిన అవసరాన్ని గుర్తించాల్సి వుంది.

ఆధ్యాత్మిక శిఖరాగ్ర గౌరవానికి ప్రతీక వాల్మీకి మహర్షి

మొదటి పేజీ తరువాయి

వాల్మీకి జీవిత విశేషాలు

వాల్మీకి జన్మము ఎట్టిది? ఆయన తల్లితండ్రులు ఎవరు? అనే విషయంపై అనేక తర్జనభర్జనలు, కట్టుకథలు ప్రాచుర్యములో ఉన్నాయి. ఏ రచయిత అయినా తన గురించి ఉపోద్ఘాతము, పరిచయము తదితర అంశములను తెలుపుకోవటము ఈనాటి రచయితలు పాటిస్తున్న విధానము. వేదవ్యాసుడు తాను మత్స్యగంధి, పరాశరుల కుమారుడనని తన రచనలలోనే చెప్పుకోవడముతో వ్యాసుడు ఎవరన్నది కచ్చితముగా తెలిసింది. అదేవిధముగా రచయితగా తాను ఎవరన్నది ప్రత్యేకముగా వాల్మీకి రాయనప్పటికీ సందర్భానుసారముగా సీతను రాముడికి అప్పచెబుతున్న సమయములో ఉత్తరకాండ (రామాయణము)లో వాల్మీకి ఇలా రాసాడు "రామా నేను ప్రాచేతసుడను ప్రచేతసుడి ఏడవ (దశమ) కుమారుడిని. వేలసంవత్సరాలు తపస్సు చేసి, ఏ పాపము చేయని, అబద్ధమాడని మహర్షిని. సీత నిన్ను తప్ప మనసా, వాచా పరపురుషుడిని ఎరగని మహాపతివ్రత. నా మాట నమ్ము, సీతను ఏలుకో. నా మాటలు తప్పు, అబద్ధము అయితే ఇంతకాలము నేను చేసిన తపస్సు భగ్నము అవుగాక." అంటాడు.

వాల్మీకి వలస

అటవీ తెగకు చెందిన వాల్మీకి కరువుల వల్ల బ్రతుకు తెరువు కోసం ఉత్తర భారతదేశం నుండి వలస బాట పట్టాడు. ఆర్య తెగకు చెందిన సప్తఋషులచే జ్ఞానోదయమైన తర్వాత, మహర్షిగా మారి దండకారణ్యం (నల్లమల అడవులు) గూండా దక్షిణ భారతదేశం, ఆ తర్వాత శ్రీలంకకు వలస వెళ్ళాడు. మార్గమధ్యంలో వివిధ ప్రదేశాల్లో బసచేస్తూ, అడవి ఆకులు, దుంపలు తింటూ విశ్రాంతి సమయంలో తన రామాయణం కావ్యాన్ని దేవనాగరి లిపిలో వ్రాస్తూ, తను వెళ్ళిన ప్రదేశాల్ని కావ్యంలో పేర్కొన్నాడు. ఆంధ్ర దేశంలో ఉన్న గోదావరి నదీతీరంలో విశ్రమించి ఆ తర్వాత వృద్ధాప్య దశ వచ్చే సరికి తమిళనాడు రామేశ్వరం సముద్ర గట్టు వద్ద నున్న షోల్ మీదుగా శ్రీలంక ప్రవేశించాడు. శ్రీలంకలో తన రామాయణాన్ని యుద్ధకాండ తో ముగించాడు. వాల్మీకి తన జీవిత కాలాన్ని శ్రీలంకలోనే ముంగించాడని విశ్లేషకులు చెబుతున్నారు. పాపం చేసినవాడైనా, నిజాయితీతో మారితే మహర్షిగా నిలుస్తాడనే స్ఫూర్తి.

ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు: కలెక్టర్

మొదటి పేజీ తరువాయి

సమస్యల పరిష్కారం కోసం ఎంతో ప్రయాసతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి సమస్యను సావధానంగా వినాలన్నారు. సమస్య ఏమిటి, దానిని ఎలా పరిష్కరించాలన్న విషయాలపై అధికారులకు అవగాహన ఉండాలని, చిత్తశుద్ధితో ప్రజల సమస్యలను నాణ్యతగా పరిష్కరించాలని పేర్కొన్నారు. అనంతరం వివిధ సమస్యలతో వచ్చిన ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. ఎన్నో వ్యయ ప్రయాసలతో, సుదూర ప్రాంతాల నుంచి జిల్లా కేంద్రం రాయచోటికి వచ్చిన అర్జీదారులకు జిల్లా కలెక్టర్ స్నాక్స్, వాటర్ బాటిల్, టీ సౌకర్యాలను కల్పించారు. అర్జీదారులు ఈ సౌకర్యాలను వినియోగించుకొని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, డిఆర్ఓ మధుసూదనరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఎవ్వరూ ఆందోళన చెందవద్దు..

మొదటి పేజీ తరువాయి

ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. మొలకల చెరువులో మీ పార్టీ ఆధ్వర్యంలోనే గత 15 నెలల కాలంగా అక్రమ మద్యాన్ని తయారు చేస్తున్న ఎస్ఓటి అధికారులు ఏమి చేస్తున్నా రని? ఆయన ప్రశ్నించారు. నెలకు వందల కోట్లు రూపాయలు ఎవరెవరికి ముడుతున్నాయో? సిబిఐ చేత దర్యాప్తు చేయించాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పచ్చకామెర్ల వారికి లోకమంతా పచ్చగా కనిపించినట్లు! నిజాలు మాట్లాడు తున్న వైకాపా పార్టీ పైనే నిందలు వేయడం సమంజసం కాదన్నారు.

వైకాపా, కూటమి.. రాష్ట్రానికి రాహు కేతువులు

విశాలాంధ్ర-వేంపల్లి: అటు వైకాపా, ఇటు టిడిపి కూటమి పార్టీలు రాష్ట్రానికి రాహుకేతువులుగా దాపురించాయని, దొందూ దొందేయని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ముఖ్య అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం వేంపల్లి లో మీడియా సమావేశంలో మాట్లాడుతూ వైకాపా ప్రభుత్వం గత ఐదు సంవత్సరాలలో రాష్ట్రాన్ని అప్పుల, అరాచక, మద్య ,గంజాయి ,డ్రగ్ ఆంధ్ర ప్రదేశ్ గా తయారుచేసిందన్నారు. ప్రస్తుతం టిడిపి కూటమి పాలనలో పరిస్థితి మరింత అధ్వాన్నంగా తయారైందని తులసి రెడ్డి అన్నారు. రాష్ట్రంలో విద్యా వ్యవస్థ అస్తవ్యస్తమైంది. రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. నానాటికి తీసి కట్టు నాగం బట్లు అన్నట్లు శాంతి భద్రతలు రోజురోజుకు క్షీణిస్తున్నాయి. ఫీజు రీయింబర్స్మెంట్ , స్కాలర్షిప్ పథకాల కింద 6400 కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయి .కానీ ఇటీవల కేవలం 400 కోట్ల రూపాయలు మాత్రమే విడుదల చేయడం జరిగింది. ఇవ్వాల్సింది కొండంత, ఇచ్చింది గోరంత. దీనివలన అటు కళాశాల యాజమాన్యాలు, ఇటు విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఇబ్బంది పడుతున్నారు. సిబ్బందికి జీతాలు ఇవ్వలేక ,కరెంటు బిల్లులు కట్టలేక, కళాశాలను నిర్వహించలేక కళాశాల యాజమాన్యాలు ఇబ్బంది పడుతున్నాయి .ఫీజు కడితేనే సర్టిఫికెట్ ఇస్తామని విద్యార్థుల మీద ఒత్తిడి తెస్తున్నాయి. దీనివలన విద్యార్థులు పై చదువులకు పోలేక, ఉద్యోగాన్వేషణ చేయలేక ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మొత్తం పెండింగ్ బకాయిలు 6400 కోట్ల రూపాయలను ఇక ఏమాత్రం ఆలస్యం చేయకుండా విడుదల చేయాలని తులసి రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో రైతుల పరిస్థితి దయనీయంగా తయారైంది. ఏ పంటకు కూడా గిట్టుబాటు ధర లభించడం లేదు. మిర్చి, పొగాకు, మామిడి, చీని, అరటి, టమోటా, ఉల్లి, పసుపు, బంతి పూలు, ఇలా ఏ పంటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. అడిగే వారు లేరు. కొనేవారు లేరు. ఈ పరిస్థితుల్లో మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి. కానీ రోమ్ నగరం తగలబడి పోతూ ఉంటే నీరో చక్రవర్తి ఫిడేల్ వాయిస్తూ కూర్చున్నట్లుగా కూటమి ప్రభుత్వ వైఖరి. మాటలు తప్ప చేతలు లేవు. ఎక్కడ ఏ పంటను కొనింది లేదు. మరొకవైపు యూరియా కొరత .ఇంకొక వైపు రసాయనిక ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయి. రైతు ఏడ్చిన రాజ్యం ఎద్దు ఈడ్చిన సేద్యం బాగుపడవు .కాంగ్రెస్ పాలనలో వ్యవసాయము పండుగ అనే వాతావరణం ఉండేది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ ద్వారా రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

పరామర్శ

విశాలాంధ్ర- రాయచోటి రూరల్: కుడి కాలు ఫ్యాక్చర్ అయి బాధపడుతున్న కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, రాష్ట్ర కిసాన్ సెల్ ఆర్గనైజర్ సింగం రామకృష్ణారెడ్డిని మదనపల్లె పట్టణములోని తన నివాసంలో సోమవారం వెళ్లి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్న అన్నమయ్య జిల్లా డిసిసి చీఫ్ సెక్రటరీ అమీర్, రాయచోటి కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు బాబా సర్దార్, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు అమీర్ భాష లు పరామర్శించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సింగం రామకృష్ణారెడ్డి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

మద్యం కుంభకోణంపై మాట్లాడే హక్కు జగన్‌కు లేదు

- ఎమ్మెల్సీ రామగోపాల్ రెడ్డి

విశాలాంధ్ర-పులివెందుల: మద్యం కుంభకోణం గురించి మాట్లాడే హక్కు వైసిపి అధినేత జగన్ కు లేనేలేదని ఎమ్మెల్సీ భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి తేల్చి చెప్పారు. పులివెందుల పట్టణ పరిధిలోని ఆయన స్వగృహంలో సోమవారం మీడియాతో మాట్లాడుతూ ఇటీవల మొలకలచెరువులో వందల కోట్ల మద్యం కుంభకోణం జరిగిందని జగన్ తో పాటు వైసీపీ నాయకులు పదేపదే విమర్శించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ విషయాన్ని సాక్షి దినపత్రికలో రాస్తున్న రోత వార్తలు ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. వాస్తవానికి మొలకలచెరువులో నకిలీ మద్యం వ్యాపారంపై కూటమి ప్రభుత్వం స్పందించిందన్నారు. ఈ నేపథ్యంలో టిడిపి ఇన్చార్జ్ జయచంద్రారెడ్డి, సురేంద్ర నాయుడులను పార్టీ నుంచి సస్పెండ్ చేసి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో నిరూపించుకుందన్నారు. అదే నకిలీ మద్యం స్కామ్ నుంచి తప్పించే అవకాశం ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధికి ప్రాధాన్యత ఇచ్చిందన్నారు. అదే వైసిపి ప్రభుత్వం హయాంలో వందల కోట్ల రూపాయల మద్యం కుంభకోణం జరిగిందన్నారు. మద్యం విక్రయాలలో అక్రమాలకు పాల్పడిన ఎంతోమంది అధికారులు జైలులో మగ్గుతున్నారన్నారు. వైసిపి ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నాయకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డికి సంబంధం లేదా అని ప్రశ్నించారు. ఇటీవల మిథున్ రెడ్డి మద్యం కుంభకోణంలో అరెస్ట్ అయిన మిషన్ రెడ్డి ప్రస్తుతం బెయిల్‌పై బయటకు వచ్చారన్నారు. దేశమంతా మద్యం విక్రయాలలో డిజిటల్ చెల్లింపులు ఉంటే ఒక్క ఆంధ్ర ప్రదేశ్ లో మాత్రం డిజిటల్ చెల్లింపులు లేకుండా ఇష్టారాజ్యంగా మద్యం విక్రయాలలో అవినీతి అక్రమాలకు తెరలేపిన విషయం రాష్ట్ర ప్రజలకు తెలుసు అన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో మద్యం విక్రయాలపై అక్రమంగా సంపాదించిన సొమ్ము ఖర్చు చేశారని ఆరోపించారు. ఎర్ర గురివింద తన నలుపు ఎరగనట్లు అన్న చందంగా మొలకలచెరువు నకిలీ మద్యం పై జగన్ రెడ్డి ఆరోపణలు అర్థరహితమన్నారు. ములకలచెరువు నకిలీ మద్యం కుంభకోణంలో తమ పార్టీ నేతలపై వెంటనే విచారించి చర్యలు చేపట్టిందనడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు చిత్తశుద్ధికి నిదర్శనం అన్నారు. ఇప్పటికైనా జగన్, ఆ పార్టీ నాయకులు వాస్తవాలు మాట్లాడితే మంచిదని హితవు పలికారు.

న్యూస్ రీల్

93వ రోజుకు చేరిన భాగవత పఠనం

విశాలాంధ్ర-లింగాల: మండలంలోని వెలిదండ్ల పంచాయతీ పరిధిలోని దేవరకోనలో చేపట్టిన భాగవత పఠనం సోమవారానికి 93వ రోజుకు చేరింది. చాతుర్మాస దీక్షల కార్యక్రమంలో భాగంగా ఇక్కడ హిందూ పురాణాలు పఠనం చేస్తున్నారు. హరిహర క్షేత్ర భాగవత భక్త సమాజం, దాతల సహకారాలతో ఈ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోంది. కాగా వచ్చే నెల 5వ తేదీ నాటికి కార్తీక పౌర్ణమి రోజున చాతుర్మాస దీక్షలు ముగియనున్నట్లు భాగవతులు వెల్లడించారు. సోమవారం కర్ణ నాగేశ్వర రెడ్డి స్వామి పాల్గొని ప్రవచనం చేశారు. కార్యక్రమంలో సమాజ అధ్యక్షులు నారాయణరెడ్డి, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: ఉపాధి హామీ పథకాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్ యనమల సుధాకర్ నాయుడు అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఉపాధి హామీ ద్వారా ప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, కార్యక్రమాలను వివరించారు. అర్హులైన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామన్నారు. పలు అభివృద్ధి పనులకు సంబంధించి గ్రామ సభలో తీర్మానాలు చేశారు. కార్యక్రమంలో ఏపీఓ రవీంద్రారెడ్డి, టెక్నికల్ అసిస్టెంట్ మల్లికార్జున్‌రెడ్డి, ఉపాధి సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

రహదారులు మరమ్మత్తులు చేయాలని వినతి

విశాలాంధ్ర-సుండుపల్లె: రహదారులు మరమ్మత్తులు చేయాలని కలెక్టర్ నిశాంత్ కుమార్‌కు సోమవారం స్పందన కార్యక్రమంలో వినతి పత్రాన్ని అందజేసినట్లు జనసేన నియోజకవర్గ నాయకులు రామశ్రీనివాస్ తెలిపారు. రాయచోటి నుండి టి.సుండుపల్లి మీదుగా రాయవరం మరియు పించ వరకు డబుల్ రోడ్డు నిర్మాణం పనులు అర్ధాంతరంగా ఆగిపోయాయని, ఇటీవల కురిసిన భారీ వర్షానికి రోడ్డుకు ఇరువైపులా కోతలకు గురై నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయని అన్నారు. అలాగే రాయచోటి వయా రాజంపేట రెండు వరుసల రహదారి పనులు అర్ధాంతరగా ఆగిపోయాయన్నారు. అలాగే టి.సుండుపల్లి మండలంలోని అగ్రహారం నుండి సామిసేని గడ్డ వరకు సుమారు 9 పల్లెలకు వెళ్లే రహదారి గుంతల మయంగా మారి వాహనదారులకే కాకుండా బాటసారులు సైతం ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ సమస్యలన్ని పరిష్కారానికి తక్షణమే పరిష్కారాలకు చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.

రైతులకు అండగా ఉంటా

- చైర్మన్ అమర్‌నాథ్‌యాదవ్

విశాలాంధ్ర-పులివెందుల: రైతులకు అండగా ఉండటమే తన బాధ్యతని మార్కెట్‌యార్డు చైర్మన్ గద్దం అమర్‌నాథ్‌యాదవ్ అన్నారు. పట్టణంలోని ముద్దునూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ మార్కెట్‌ను సోమవారం రైతులు మార్కెట్ యార్డ్ కార్యాలయానికి తాళం వేశారు. అధికారులతో వాగ్ వివాదానికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న నూతనంగా మార్కెట్ యార్డ్ చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన గద్దం అమర్నాథ్ యాదవ్ వెంటనే కార్యాలయం వద్దకు వచ్చి రైతులతో మాట్లాడారు. రైతులు చీని కాయ కొనుగోలు పద్ధతిలో ఈబినామ్ పద్ధతి రైతులకు తీవ్ర అసంతృప్తి కలిగిస్తుందని రైతులు తెలుపగా. విషయం తెలుసుకున్న మార్కెట్ యార్డ్ చైర్మన్ అమర్నాథ్ రైతులకు మేలు కలిగే విధంగా తగిన చర్యలు తీసుకుంటానని త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని ఆయన తెలిపారు. అనంతరం రైతులకు అండగా ఉండడమే తన బాధ్యతని రైతులకు ఎటువంటి అసౌకర్యం కలిగిన వెంటనే తనకు తెలియజేయాలని ఆయన కోరారు.

ఫైవ్ జి మొబైల్ ఇవ్వాలి.. పని భారం తగ్గించాలి

- అసిస్టెంట్ మేనేజర్‌కు విఓఏల వినతి

విశాలాంధ్ర-పులివెందుల: మండల సమాఖ్యలో పనిచేస్తున్న వివోఏలు తమ నాలుగు డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ సోమవారం వారు మెప్మా అసిస్టెంట్ మేనేజర్ గురురాజుకు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ మా సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉన్నతాధికారులకు వినతి పత్రాలను సమర్పించామని, కానీ ఉన్నతాధికారులు మా సమస్యలను పరిష్కరించలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా సెర్ప్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయిలో ఆందోళన చేసిన మా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ముఖ్యంగా ఫైవ్ జి మొబైల్స్ ఇవ్వకుండా క్రింది స్థాయిలో ఆన్లైన్ పనులు చేయలేదని వేధింపులకు గురి చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. 5జి మొబైల్స్ ఇచ్చేవరకు ఆన్లైన్ పనులు చేయలేమని, అలాగే ప్రతి పనికి టార్గెట్ ఇచ్చి ఒత్తిడి చేస్తున్నారని ఇలాగైతే మేము పనులు చేయలేమని వారు వినతి పత్రంలో పేర్కొన్నారు. స్పందించిన మెప్మా అసిస్టెంట్ మేనేజర్ గురురాజు మాట్లాడుతూ సమస్యలన్నీ ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని ఆయన వారికి హామీ ఇచ్చారు.

గంగిరెడ్డి విగ్రహావిష్కరణ



విశాలాంధ్ర-వేంపల్లి: కడప జిల్లా పెండ్లిమర్రి మండలం, కొత్త గంగిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం సాయి గంగా భరత్ ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు స్వర్గీయ నరెడ్డి పెద్ద గంగిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమం జరిగింది. గంగిరెడ్డి విగ్రహావిష్కరణ కార్యక్రమంతో పాటు ఆయన సతీమణి స్వర్గీయ నరెడ్డి గంగమ్మ, ఆయన మనుమడు స్వర్గీయ నరెడ్డి భరత్ కుమార్ రెడ్డిల విగ్రహాల ఆవిష్కరణ కూడా జరిగింది. రాజ్యసభ మాజీ సభ్యులు డాక్టర్ నరెడ్డి తులసి రెడ్డి, మాజీ జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ అలంకానిపల్లి లక్ష్మిరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. మానవ సంబంధాలు దూరమవుతున్న నేటి రోజుల్లో గంగిరెడ్డి కుమారులు నరెడ్డి మునికుమార్ రెడ్డి రెడ్డి, నరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వారి కుటుంబ సభ్యులు తల్లిదండ్రుల విగ్రహాలను ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. అడ్వకేట్ రాఘవరెడ్డి, శ్రీనివాసులు, కవిశివారెడ్డి, ప్రభాకర్, అనేకమంది కుటుంబ హితులు, సన్నిహితులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం

విశాలాంధ్ర-రామసముద్రం: కర్ణాటక రాష్ట్రంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు దుర్మరణం చెందిన సంఘటన సోమవారం మండలంలో ఓ కుటుంబాన్ని రోడ్డున పడేసి విషాదం నింపింది. మండలంలోని కమ్మువారి పల్లి పంచాయతీ ఎర్రబోయినపల్లికి చెందిన రామాంజులు (36) కళావతి(25) భార్యాభర్తలు వీరికి ఇద్దరు కుమారులు కలరు కూలీ చేసుకుని సాగిస్తున్నారు సోమవారం ద్విచక్ర వాహనంపై కోలార్ జిల్లా శ్రీనివాసపురం తాలూకా రాయలపాడు వద్ద మదనపల్లె లో వైద్య చికిత్స కోసం భార్యాభర్తలు ఇద్దరూ వెళ్తుండగా మినీ బస్సు ఢీకొని సంఘటనా స్థలంలోని ఇద్దరు మృతి చెందారు కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో శ్రీనివాసపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

దంత వైద్య విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

విశాలాంధ్ర-కడప: కడప నగర శివారులోని ప్రభుత్వ దంత వైద్య కళాశాలలో ఫస్ట్ ఇయర్ బిడిఎస్ చదువుతున్న సరస్వతి పరీక్షలలో సరిగా చదవలేదని మానసిక ఆవేదనతో తమ హాస్టల్ భవనం పైనుంచి క్రిందకు దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. తాడిపత్రికి చెందిన సరస్వతి తండ్రి కిషోర్ కుమార్ రెడ్డి. ఫస్ట్ ఇయర్ డెంటల్ విద్యార్థులకు గత కొన్ని రోజుల నుంచి పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో ఫైనల్ ఫస్ట్ ఇయర్ పరీక్ష సోమవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కానుంది. ఈ క్రమంలో విద్యార్థిని సరస్వతి తనకు సరిగా పరీక్షలు రాసేందుకు అవకాశం లేదని ఆవేదన చెందింది. ఈ క్రమంలో ఉదయం నిద్ర లేచి పరీక్షలు చదువుతున్న సమయంలో రెండవ అంతస్తుకు వెళ్లి అక్కడి నుంచి ఆవేదనతో క్రిందికి దూకినట్లు సమాచారం. ఈ విధంగానే విద్యార్థిని రిమ్స్ పిఎస్ సిఐ రామకృష్ణారెడ్డికి స్టేట్మెంట్ ఇచ్చినట్లు సీఐ వెల్లడించారు. కాగా కళాశాల అధికారులు మాత్రం తమకు ప్రాథమికంగా తెలిసిన సమాచారం ప్రకారం వర్షం నీరు రావడంతో జారీ క్రింద పడిందని తీవ్ర గాయాలయ్యాయని తెలియజేశారు. విద్యార్థిని ప్రస్తుతం కడప నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్లో చికిత్స పొందుతోంది. విద్యార్థిని తండ్రి బంధువులు విషయాన్ని తెలియజేసేందుకు నిరాకరించారు. ఈ సంఘటనపై రిమ్స్ పిఎస్ సిఐ రామకృష్ణారెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.

చీఫ్ జస్టిస్‌పై దాడికి యత్నించిన వారిని కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర-రాయచోటి రూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ సోమవారం తన విధుల్లో ఉండగా ఒక దుర్మార్గుడు దాడి చేయడానికి ప్రయత్నించడం సనాతన ధర్మాన్ని అవమానించిన వారిని వదిలిపెట్టమని కేకలు వేయడం దారుణమని అతనిపై తక్షణం కఠిన చర్యలు తీసుకోవాలని భారత న్యాయవాదుల సంఘం (ఐ ఎ ఎల్) అన్నమయ్య కడప ఉమ్మడి జిల్లాల వర్కింగ్ ప్రెసిడెంట్ టీ. ఈశ్వర్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్. ఆనంద్ కుమార్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయ్ తాను బాధ్యతలు చేపట్టిన రోజునే "భారత రాజ్యాంగమే సుప్రీం" అని ప్రకటించారని ఆ రోజు నుండి మత చాందసవాదులు ఈ మాటలు భరించలేక రాజ్యాంగ వ్యతిరేక శక్తులు ప్రధాన న్యాయమూర్తి పై కన్నేసి ఉంచారని, న్యాయవ్యవస్థ తాము చెప్పినట్లే నడుచుకోవాలని రాజ్యాంగం చెప్పినట్టు కాదని ఆలోచిస్తున్నా వారి కుట్రలో భాగమే ప్రధాన న్యాయమూర్తి పై ఈ దాడికి ప్రయత్నం జరిగిందని ఇది దేశానికి చాలా ప్రమాదకరమని వారన్నారు. ఇది జస్టిస్ గవాయి పై దాడిగా మనం చూడాల్సిన అవసరం లేదని ప్రజాస్వామ్య మనుగడకు ప్రధానమైన న్యాయవ్యవస్థపై దాడిగానే చూడాలని ప్రజలు ప్రజాస్వామ్యవాదులు ఇలాంటి దాడులను తీవ్రంగా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐఎఎల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల కాలనీలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ మున్సిపల్ పరిధిలో ఉన్నటువంటి దివ్యాంగులందరికీ ఇంటి స్థలం రెండు సెంట్లు ఇచ్చి పక్క గృహాలు నిర్మించి కాలనీని ఏర్పాటు చేయాలని దివ్యాంగుల పోరాట సమితి బద్వేల్ పట్టణ కమిటీ తరపున బద్వేల్ ఏవో ఉదయభారతికి సోమవారం వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా దివ్యాంగుల పోరాట సమితి పట్టణ అధ్యక్షులు బాలరాజు రఫీ, ఎం రమణ మాట్లాడుతూ సమాజం లో వెనుకబడినటువంటి దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చి పక్కా గృహాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. వైయస్ జగన్ జగనన్న కాలనీలలో కూడా దివ్యాంగులకు ప్రాధాన్యత ఇవ్వలేదని వాపోయారు. ఇప్పుడైనా కూటమి ప్రభుత్వం దివ్యాంగులకు ఇంటి స్థలాలు ఇచ్చి ఆదుకోవాలని వారు ప్రభుత్వాని కోరారు. ఈ కార్యక్రమంలో నాగూర్ భాష, షేక్ వలి, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తల భద్రత..ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యం

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్ : రెడ్ బుక్ అరాచకాలకు అడ్డుకట్ట వేసేందుకు కార్యకర్తల భద్రత, ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమని నార్త్ జోన్ మండల అధ్యక్షులు ఇలియాస్ బి.హెచ్ అన్నారు. సోమవారం డిజిటల్ బుక్ పోస్టర్‌ను నార్త్ జోన్ డివిజన్ కార్పొరేటర్లు, ఇంచార్జ్‌లు కమిటీ సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఇలియాస్ మాట్లాడుతూ రెడ్ బుక్ అరాచకాలు అడ్డుకునేందుకు డిజిటల్ బుక్ అని కార్యకర్తల భద్రత ప్రజా సంక్షేమమే జగనన్న లక్ష్యమన్నారు.వైసీపీ కార్యకర్తలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు మన ప్రభుత్వం వచ్చిన వెంటనే సత్వరమే పరిష్కారం లభించేలా వైసీపీ అధినేత, జగన్ డిజిటల్ బుక్ రూపొందించారన్నారు. ప్రజల దృష్టి పక్కదారి మళ్లించేందుకు వైసీపీ నేతలపై అక్రమ కేసులు పెట్టి వేధిస్తుందన్నారు. నిరుద్యోగ భృతి ఇంతవరకు ఇవ్వలేదన్నారు. 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని 20 వేల ఉద్యోగాలు కూడా ఇవ్వలేదన్నారు. రాష్ట్ర బిసి ప్రధాన కార్యదర్శి బసవరాజు, రాష్ట్ర

మైనారిటీ ప్రధాన కార్యదర్శి అలీ అక్బర్, రాష్ట్ర మైనారిటీ సెల్అధికార ప్రతినిది షేక్ గౌస్ బాషా (చాక్లెట్), కడప పట్టణ మైనారిటీ అధ్యక్షులు షఫీ మాట్లాడుతూ తన స్వంత అన్న మెగాస్టార్ చిరంజీవిని ఉద్దేశించి దేవాలయం లాంటి అసెంబ్లీలో బాలకృష్ణ వాడు వీడు అని సంబోధించి ఇన్ని రోజులు అయినా పవన్ ఉలుకు లేదు పలుకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు షంషేర్,అజ్మతుల్లా, ఆరిఫుల్లా, జీలాన్,నార్త్ జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, ఉపాధ్యక్షులు మహమ్మద్ గౌస్ (బాబు భాయి) సభ్యులు మహమ్మద్ అలీ, గౌస్, ఇమ్రాన్,సమీర్, ఖాదర్, రెహమాన్, మరియు ఎన్ఆర్ఐలు షేక్ఇ గయాజ్, ఫారూఖ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం డిడిగా నాగరత్నమ్మ

విశాలాంధ్ర-కడప : వైద్య, ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 డిప్యూటీ డైరెక్టర్(డిడి)గా ఎం.ఎన్ నాగరత్నమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె కర్నూలు ప్రభుత్వ మెడికల్ కాలేజీ పరిపాలన విభాగం అధికారిగా విధులను నిర్వహిస్తూ పదోన్నతిపై డిడిగా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డిడిగా బాధ్యతలు చేపట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. నిబంధనల ప్రకారం విధులను చేపడుతామని జోన్-4 ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.ఉద్యోగుల సర్వీస్ తదితర అంశాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈ సందర్భంగా ఆ శాఖ రీజినల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య,కార్యాలయ సిబ్బంది అభినందనలు తెలిపారు.

నేడే డాక్టర్లకు ఆశ వర్కర్ల సమస్యలపై వినతి

విశాలాంధ్ర-కడప రూరల్ : ఆశాల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం జరుగు ఆశాడే సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని డాక్టర్లకు వినతి పత్రాలు అందజేస్తామని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా అధ్యక్షురాలు యు. మరియమ్మ తెలిపారు. స్థానిక జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు గుంటి వేణుగోపాల్ జిల్లా అధ్యక్షురాలు యు.మరియమ్మ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి నేతలు ఎన్నికల ప్రచారంలో ఆశాలకు మెరుగైన వేతనాలు ఇస్తామని, ఉద్యోగ భద్రత కలిపిస్తామని, సంక్షేమ పథకాలు వర్తింప చేస్తామని ఇచ్చిన హామీని రాష్ట్ర ప్రభుత్వం తక్షణం అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సాధారణ సెలవులు, పండగ సెలవులు వర్తింపు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సంతకంతో ఐడెంటి కార్డులు, మరణించిన ఆశా కార్యకర్తలకు మట్టి ఖర్చులు రూ.20 వేలు, ఏఎన్ఎం చేసిన ఆశా కార్యకర్తలకు ఆశా సర్వీసును పరిగణలోనికి తీసుకుని ఏఎన్ఎం పోస్టుల భర్తీలలో ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి పదవోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. మంత్రి లోకేష్ ఆశాలకు తల్లికి వందనం వర్తింపచేయాలని డిమాండ్ చేశారు.ఆశాల సమస్యలు పరిష్కరించని పక్షంలో జిల్లా వ్యాప్తంగా ఉద్యమాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు అనసూయ, జిల్లా కోశాధికారి సి అమ్ములు పాల్గొన్నారు.

వాహనదారులకు తప్పకుండా పర్మిట్లు ఉండాలి

విశాలాంధ్ర-రామాపురం : వాహనం నడుపు వాహనదారులందరికీ వాహనం సంబంధించిన పర్మిట్లు కలిగి ఉండాలని మోటార్ వెహికల్ అసిస్టెంట్ ఇన్స్పెక్టర్ గాయత్రి అన్నారు స్థానిక మండలంలోని కసిరెడ్డి గారి పల్లి పంచాయతీ కొత్త రోడ్డు నారాయణపురంలోని పోలీస్ చెక్పోస్ట్ వద్ద సోమవారం సాయంత్రం వాహనాలను తనిఖీ చేశారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులకు సంబంధించి పేర్మింట్ల వాహనం నడిపే వ్యక్తికి సంబంధించి డ్రైవింగ్ లైసెన్సు ఆర్సి ఇన్సూరెన్స్ తప్పకుండా ఉండాలని ఆమె అన్నారు. బండికి సంబంధించిన పర్మిట్లు లేకుంటే వారిపై తగిన చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

11న సీతారామ లక్ష్మణ విగ్రహ ప్రతిష్ట

విశాలాంధ్ర-చెన్నూరు : మండలంలోని శివాలపల్లెలో నూతనంగా నిర్మించిన రామాలయంలో ఈనెల 11వ తేదీ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం అత్యంత వైభవంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వేద పండితులు ప్రశాంత్ శర్మ బృందంచే వేద మంత్రాలు మంగళ వాయిద్యాల నడుమ ఈ నెల 9 నుండి మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. దాతల విరాళాలు, టీటీడీ సహకారంతో సుమారు రూ.50 లక్షలతో ఆలయ నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా 9వ తేదీ ఉదయం 8 గంటల నుండి గోపూజ, గణపతి పూజ, ఏకాదశ రుద్రాభిషేకం. అనంతరం విగ్రహమూర్తుల గ్రామోత్సవం ఉంటుందన్నారు. 11వ తేదీ ప్రాణ ప్రతిష్ట కార్యక్రమాలు ఉంటాయన్నారు. సీతారాముల కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. మూడు రోజుల పాటు అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమాలలో ప్రజల పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించి స్వామివారి కృపకు పాత్రులు కాగలరని కోరారు.

రైతుల సమస్యలను పరిష్కరించిన తాసిల్దార్

విశాలాంధ్ర- రామాపురం : మండలంలోని కొన్ని రకాల సంబంధించిన పిజిఆర్ఎస్ సమస్యలను పరిష్కరించినట్లు తాసిల్దార్ వెంకటేశులు తెలిపారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యలపై వీఆర్వోలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో వివిధ రకాలు సంబంధించి 10 పీజీఆర్ఎస్ సమస్యలను తమ దృష్టికి వచ్చాయని వాటిని వెంటనే పరిష్కరించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో సమస్యలు లేకుండా చూసుకోవాలని ఆయన విఆర్ఓలకు సూచించారు. రైతులను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా వారి సమస్యలను వెంటనే గ్రామ సచివాలయంలోనే పరిష్కరించాలని ఆయన తెలియజేశారు. సచివాలయాల్లో పరిష్కారం కాని సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తాసిల్దార్ కృపావతి. మండల రెవిన్ ఇన్స్పెక్టర్ సమర్థ. వీఆర్వోలు వీఆర్ఏలు పాల్గొన్నారు.

బస్సులు తక్కువ..ప్రయాణికులు ఎక్కువ ప్రమాదకరంగా ఫుట్ బోర్డుపై ప్రయాణం

విశాలాంధ్ర - ముద్దనూరు : ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేయడంతో మహిళలు ప్రయాణాలు ఎక్కువయ్యాయి. బస్సులు తక్కువ ప్రయాణికులు ఎక్కువ కావడంతో ప్రయాణికులు,మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాడిపత్రి డిపోకు చెందిన ఆర్టిసి బస్సు శనివారం ఉదయం తాడిపత్రి నుంచి ముద్ద నూరు మీదుగా ప్రొద్దుటూరు వెళ్లి తిరుగు ప్రయాణంలో ముద్దనూరులో ప్రయా ణికులు కిక్కిరిసిపోయారు. బస్సు లోపల ప్రయా ణికులు ఎక్కువ కావడంతో లొపలికి వెళ్లేందుకు వీలు లేక పురుషులు,మహిళలు ఫుట్ బోర్డుపై నిలబడి ప్రమాదకరంగా ప్రయాణిస్తున్నారు. డ్రైవర్ కాసేపు బస్సు నిలిపినా ఫుట్ బోర్డుపై ప్రయాణికులు దిగక పోవడంతో చేసేదిమి లేక అలాగే వెళ్ళి పోయాడు. ప్రమాదకరంగా ఉండడంతో చూసే బెంబేలెత్తి పోయారు. రద్దీని దృష్టిలో పెట్టుకుని అధికారులు తగినన్నినడపాలని ప్రయాణికులుకోరుతున్నారు.

వికలాంగులపై ప్రభుత్వం దృష్టిసారించాలి : గోవింద్ గణేష్

విశాలాంధ్ర-చెన్నూరు : రాయలసీమలో ఉన్నటువంటి వికలాంగుల సమస్యలపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టి, పూర్తిస్థాయిలో వికలాంగుల సమస్యల మీద పోరాటం చేస్తానని రాయలసీమ వికలాంగుల హక్కుల పోరాట సమితి అధ్యక్షులు గోవిందు గణేష్ పేర్కొన్నారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వికలాంగుల కోసం పోరాటం చేస్తానని, రాష్ట్రంలో చాలామంది వికలాంగులకు అన్యాయం జరిగిందన్నారు. చాలామంది నిజమైన వికలాంగులకు వికలత్వం ఉన్నప్పటికీ వారికి పెన్షన్ సంబంధిత సర్టిఫికెట్‌లో పూర్తిస్థాయిలో పర్సంటేజీ తగ్గించి వేయడం అనేది చాలా దారుణమన్నారు. మరొకసారి రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల మీద దయ ఉంచి వారికి మరొక్కసారి పరీక్ష నిర్వహించాలని కోరారు.

పీకేఎం ఉడా ఛైర్మనుగా డాక్టర్ బి.ఆర్.సురేష్ బాబు

- ప్రోటోకాల్ పాటించకపోవడంపై తెలుగు తమ్ముళ్ల అసంతృప్తి

విశాలాంధ్ర-మదనపల్లె: పలమనేరు, కుప్పం,మదనపల్లి, పుంగనూరు,తంబళ్లపల్లి అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మనుగా డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు సోమవారం పదవి బాధ్యతలు చేపట్టారు.ఈ నేపథ్యంలో రాజంపేట పార్లమెంట్ అధికార ప్రతినిధి ఆర్.జె.వెంకటేష్ సురేష్ బాబును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో భాగంగా ప్రభుత్వ విప్,శాసనసమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.సురేష్ బాబు తండ్రి బి.ఆర్ దొరస్వామి నాయుడు రాజకీయాల్లో తనదైన గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. బి.ఆర్.సురేష్ బాబు సారధ్యంలో పికేయం ఉడా ప్రగతి పథంలో నడవాలని ఆకాంక్షిం చారు.అయితే కార్యక్రమం ప్రారంభ సమయంలో స్టేజిపైకి ఎమ్మెల్యే,ఎమ్మెల్సీలను ఆహ్వానించే సమయంలో ప్రోటోకాల్ పాటించకపోవడంపై ఆయన అభ్యంతరం వ్యక్తం చేశారు.రాటకొండ మధుబాబుకు రాష్ట్రస్థాయి పదవి ఉందని, తాను రాజంపేట పార్లమెంటరీ అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నానని మమ్మల్ని కనీసం గుర్తించకపోవడం దురదృష్టకర మన్నారు.పార్టీలో కష్టపడ్డ వారికి సముచిత స్థానం కల్పించాలని సీఎం చంద్రబాబు,మంత్రి నారా లోకేష్ బాబు పదేపదే చెబుతున్నారని,అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు అందుకు భిన్నంగా ఉన్నాయన్నారు.ఇప్పటికైనా కార్యక్రమాల నిర్వహణలో ప్రోటోకాల్ పాటించి,సీనియర్ నాయ కులను గౌరవిస్తే బాగుంటుందని ఆయన హితవు పలికారు.ఈ కార్యక్రమంలో పెరవలి నవీన్,నారా లోకేష్ యువసేన వ్యవస్థాపకులు కంచర్ల చింటూ తదితరులు పాల్గొన్నారు.

మిట్స్‌లో మెగా ల్యాప్‌టాప్, టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో

విశాలాంధ్ర-మదనపల్లె: మిట్స్‌లో మెగా ల్యాప్‌టాప్, టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పో ను ఏర్పాటుచేసినట్లు యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ సి. యువరాజ్ అన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఈ మెగా ల్యాప్‌టాప్, టెక్నో గాడ్జెట్స్ ఎక్స్‌పోలో పాల్గొని అత్యాధునిక టెక్నాలజీలతో ప్రముఖ బ్రాండ్ ల ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్స్, స్మార్ట్ పరికరాలు పనిచేసే విధానం, ప్రీ బుకింగ్‌లు చేసుకున్నట్లు తెలిపారు. నూతన పరికరాలు అత్యాధునిక టెక్నాలజీ టెక్నో గాడ్జెట్స్ చూసి విద్యార్థులు ఆకర్షణీయులు అయ్యారన్నారు.

జీఎస్టి 2.0, సూపర్ సేవింగ్స్‌పై అవగాహన

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్ : కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు నేడు పోరుమామిళ్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వాణిజ్య శాస్త్ర విభాగం అధ్యాపకులు పర్వీన్ ఆధ్వర్యంలో ప్రిన్సిపాల్ డాక్టర్ శ్యాముల్ డేవిడ్ రాజ్ అధ్యక్షతన "జీఎస్టి 2.0, సూపర్ సేవింగ్స్" అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు పన్నులపై అవగాహనతో ఉండాలని, జీఎస్టి ఉపయోగాల గురించి గ్రామాలలో తెలియపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు ప్రకాష్ రావు, వెంకటరావు, యుబండి ఈశ్వరయ్య, రవిచంద్ర, డాక్టర్ సులోచన, శోభన్ బాబు ఇతర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర బైకుల దొంగ అరెస్ట్

13.50 లక్షల విలువైన 25 వాహనాలు స్వాధీనం

విశాలాంధ్ర- మదనపల్లె : అంతర్రాష్ట్ర బైకుల దొంగను సోమవారం మదనపల్లె తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ మేరకు డిఎస్పీ మహేంద్ర, సిఐ కళా వెంకటరమణలు స్థానిక తాలూకా పోలీస్ స్టేషన్ వద్ద నిందితున్ని అరెస్ట్ చూపి వివరాలు వెల్లడించారు. అరెస్ట్‌కు సంబంధించి డిఎస్పీ మహేంద్ర మాట్లాడుతూ చిత్తూరు జిల్లా, పుంగనూరు మండలం, చంద్రమాకుల పల్లెకు చెందిన పులి వెంకటరెడ్డి (33) మదనపల్లెతో పాటు కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా, తిరుపతి జిల్లా ప్రాంతాల్లో సుమారు 40 బైక్ లు దొంగలించాడన్నారు. వీటిలో 25 ను స్వాధీనం చేసుకున్నామని, ఇంకా 20 వాహనాల వివరాలు తెలియాల్సి ఉందన్నారు. పొరుగు రాష్ట్రంలో చోరీ చేసిన వాహనాలను ఆంధ్రప్రదేశ్ అమ్మడం, ఏపిలో చోరీ చేసిన వాహనాలను పక్క రాష్ట్రం లో అమ్ముతూ సొమ్ము చేసుకునేవాడని తెలిపారు. బైకులు చోరీకి గురవ్వుతుండడంతో నిఘా పెట్టిన మదనపల్లె తాలూకా పోలీసులు బసినికొండలో వాహనాల తనిఖీ చేశారు. ద్విచక్రవాహనంలో వచ్చిన వెంకట్ రెడ్డి పోలీసులను చూసి పారిపోయే ప్రయత్నం చేయడంతో పట్టుకోవడం జరిగిందన్నారు. విచారణలో నింది తుడు నేరం ఒప్పుకోవడం దాచిపెట్టి 25 బైకులను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామని తెలిపారు. కేసు దర్యాప్తు ను కొనసాగించి చోరికి గురైన మరిన్ని వాహనాలను రికవరీ చేస్తామని డిఎస్పీ తెలిపారు.

నిమ్మనపల్లెలో ఏడుగురు జూదరులు అరెస్ట్

విశాలాంధ్ర-మదనపల్లె: అన్నమయ్య జిల్లా లోని మదనపల్లి నియోజకవర్గం, నిమ్మనపల్లి మండలం పోలీసులు డ్రోన్ కెమెరాతో పేకాట స్థావరం పై దాడులు జరిపి ఏడుగురిని అరెస్టు చేశారు. మదనపల్లి డిఎస్పి మహేంద్ర, ఎస్సై తిప్పేస్వామి సోమ వారం తెలిపిన వివరాల మేరకు...మండలంలోని దిగువపల్లె వద్ద పేకాట ఆడు తున్నట్లు ముందస్తు సమాచారం అందిందన్నారు. డిఎస్పీ ఆదేశాలతో పేకాట స్థావరంపై నిమ్మనపల్లి పోలీసులు డ్రోన్ కెమెరాతో దాడులు జరిపి ఏడుగురిని అరెస్టు చేసి 20,850 రూపాయల నగదును సీజ్ చేశామని తెలిపారు.

కాలువ సమస్యకు పరిష్కారం చూపిన-ఈఓ బ్రహ్మా రెడ్డి

విశాలాంధ్ర - పీలేరు : పీలేరు శివారు ప్రాంతం కోటపల్లిలో కాలువ సమస్య పరిష్కారం అయింది. ఇటీవల పీలేరు ఇన్చార్జ్ ఈవోగా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మా రెడ్డిని పీలేరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కోటపల్లిలో మురుగు కాలువ సమస్యను ఈవో దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఈవో తక్షణమే జెసిబి సహాయంతో క్షేత్రస్థాయిలోకి వెళ్లారు. అక్కడ ఉన్న మురుగు కాలువ వర్షాలకు పూడిపోయి మురుగు నీరు అంతా రోడ్డుపై పారుతూ ఉండడాన్ని ఈవో గుర్తించారు. జెసిబి తో కాలువలో పూడికలు తీయించి, చెత్తా చెదారం, వ్యర్థాలను తొలగింప చేశారు. దీంతో స్థానికులు ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

జీఎస్టీ తగ్గింపుతో రైతులకు లబ్ధి

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రైతులకు అవసరమయ్యే వ్యవసాయ పరికరాల కొనుగోలులో జీఎస్టీ తగ్గింపుతో రైతులకు ఎంతో లబ్ధి జరుగుతుందని రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి తెలిపారు. సోమవారం 'సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్' కార్యక్రమంపై రాయచోటి టౌన్ మాసా పేట మార్కెట్ యార్డులో వ్యవసాయ,ఉద్యాన శాఖలు సంయుక్తంగా రైతులకు, ప్రజలకు అవగాహన కొరకు ఎగ్జిబిషన్ స్టాల్స్ ప్రదర్శన, అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తో కలసి లక్ష్మీ ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలుఅమలు చేస్తున్న నూతన జీఎస్టీ విధానం వల్ల రైతులకు అవసరమయ్యే ట్రాక్టర్లు, డ్రిప్పు స్ప్రింకర్లు మీద ఐదు శాతం జీఎస్టీ మాత్రమే ఉంటుందన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం ఉద్యోగస్తులకు ఎంఈఎఫ్ అండ

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం : ఎంఈఎఫ్ సంఘం నూతన అధ్యక్షులుగా కొడవటి గంటి గురవయ్య, కార్యదర్శిగా సోమిరెడ్డిపల్లె ఓబయ్య, కోశాధికారిగా ముండ్లపాటి చంద్రశేఖర్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా ఎంఈఎఫ్ ఉపాధ్యక్షులు, హరినాథ్, నియోజకవర్గ లక్కినేని బాబు ఆధ్వర్యంలో రాష్ట్ర ఆర్గనైజింగ్ నాయకులు జోనస్ కలిసి కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు ఉద్దేశించి ఎన్నికైన మండల కమిటీ అధ్యక్షులు కార్యదర్శి, మాట్లాడుతూ మాదిగ ఉద్యోగాల సమస్యల కోసం నిరంతరం కృషి చేసేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. ఈ నెల 15న కడప జిల్లాకు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జిల్లా పర్యటనను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎం ఈ ఎఫ్ నాయకులు సత్యాల గోపాల్, సురేష్ రామకృష్ణ మండల ఎం ఈ ఎఫ్, నాయకులు, చిట్వేల భాస్కర్ సోమిరెడ్డిపల్లి దేవ దాసు, తదితరులు పాల్గొన్నారు.

తెలుగుదేశం పార్టీ అంటే క్రమశిక్షణ పార్టీ

విశాలాంధ్ర-పెద్దతిప్పసముద్రం: టీడీపీ అంటే క్రమశిక్షణ కలిగిన పార్టీ అని నాయకులు పేర్కొన్నారు. పిటిఎం బస్టాండ్‌లో మండల కన్వీనర్ ఆనంద్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాలతో నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఎవరు తప్పు చేసినా పార్టీ ఉపేక్షించదని అన్నారు. నకిలీ మద్యం కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న పార్టీ నియోజకవర్గ నాయకులు ఇద్దరినీ పార్టీ నుండి సస్పెండ్ చేయడం శుభసూచకమని అన్నారు. ఇప్పటికైనా పార్టీ అధిష్టానం కార్యకర్తలకు అందుబాటులో ఉండే వారిని ఇన్చార్జిలుగా నియమించాలన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు ఈశ్వరప్ప, మాజీ ఎంపిటిసి సభ్యుడు చిన్న, నాయకులు ఈవి రమణ, సుధాకర్ రెడ్డి, శివానంద, శ్రీనివాసులు, కార్యం సుబ్రహ్మణ్యం, చింతకాయల వినోద్, రెడ్డి ప్రసాద్ ఐపాల్గొన్నారు.

దళితవాడలకు కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి :సీపీఐ

విశాలాంధ్ర- రాయచోటి రూరల్ : రాయచోటి సోమవారం అన్నమయ్య జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సిపిఐ ఆధ్వర్యంలో అన్ని దళితవాడలకు సిసి రోడ్లు ఏర్పాటు చేయాలని సిపిఐ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ వినతి పత్రం సమర్పించారు ఈ సందర్భంగా సిపిఐ రాయచోటి నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు మాట్లాడుతూ, అరవీడు గ్రామ పరిధిలోనే అలక చెరువు చెరువు ప్రభుత్వాలు మారుతు న్నాయి, పాలకులు మారు తున్నారు కానీ దళితుల బ్రతుకులు మాత్రం మారడం లేదన్నారు. స్వాతంత్రం వచ్చి 78 సంవత్సరాలు గడిచినా అలకాన్ చెరువు హరిజనవాడకు రహదారి ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటు అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి శాశ్వత రహదారి నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతి చిన్నయ్య మద్రి సుమిత్ర వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పందుగొల్ల మణి, కార్యకర్తలు పాల్గొన్నారు.

నకిలీ మద్యంపై సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ : నిస్సార్ అహమ్మద్

విశాలాంధ్ర-మదనపల్లె: రాష్ట్రాన్ని నకిలీ మద్యానికి అడ్రెస్ చేయాలని కేరాఫ్ అనుకున్నారా సిఎం చంద్రబాబునాయుడు, పరిశ్రమలు తెస్తా అంటే అంటే ప్రజలు నమ్మిపోయారు.తీరా మీరు నకిలీ మద్యం తయారీ కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేస్తారని ఎవరూ ఊహించలేదని మదనపల్లె వైసిపి సమన్వయకర్త నిస్సార్ అహమ్మద్ ఎద్దేవా చేశారు. సోమవారం అవెన్యూ రోడ్డులోని వైసిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కూటమి ప్రభుత్వంలో నకిలీ మద్యం తయారీ పైన విమర్శలు గుప్పించారు. తంబళ్లపల్లె నియోజకవర్గం ములకలచెరువులో టిడిపి నాయకుల కనుసన్నల్లో జరిగిన నకిలీ మద్యం తయారీ పైన ఏమీ సమాధానం చెబుతారని నిలదీస్తారు. కల్తీ మద్యం ఏడాది కాలంగా చీకటి వ్యాపారంగా జరుగుతోందని, ఇప్పటి వరకు ఎంత అమ్మకాలు సాగించారు, తాగి ఎంతమంది అనారోగ్యంతో ఆసుపత్రులలో చేరారని ప్రశ్నించారు. మన విజన్ విజనరీ అంటే ఇదేనా చంద్రబాబు అని ఎద్దేవా చేశారు. కోట్ల రూపాయల కల్తీ మద్యం వ్యాపారం కేసును సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. బ్యాంకు లావాదేవీలపై విచారణ చేసి ఎక్కడికి ఈ డబ్బులు చేరాయి అని బయటపెట్టాలి అని డిమాండ్ చేశారు. అసలు సూత్రదారు జనార్ధన రావు వెనుక ఎవరున్నారో తెలియాలి అంటే కేసు సిట్టింగ్ హైకోర్టు జడ్జికి అప్పగించాలని కోరారు. ఖచ్చితంగా సిట్టింగ్ హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని లేదంటే దీనిపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు.

మార్కెట్ వేలం పాట సమయం మార్చాలి - రైతు సంఘం కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర-రాయచోటి:రాయచోటి పట్టణంలోని కూరగాయల మార్కెట్ వేలం పాట సమయాన్ని మార్చాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అన్నమయ్య జిల్లా ప్రధాన కార్యదర్శి వి.రంగారెడ్డి, రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాధ నాయుడులు సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. రాయచోటి కూరగాయల మార్కెట్ కు 9 మండలాల రైతులు తాము పండించిన పలురకాల కూరగాయలు ఆకుకూరలు మార్కెట్ కు తరలిస్తుంటారు. అయితే మార్కెట్లో గతంలో కరోనా సమయంలో అర్ధరాత్రి సమయంలో కూరగాయల వేలంపాట నిర్వహించే వారు అప్పటినుంచి అలాగే కూరగాయల మార్కెట్ వేలం పాట సాగుతుంది దీంతో రైతులు అష్ట కష్టాలు పడి అర్ధరాత్రికి మార్కెట్ కు పండించిన కూరగాయలు ఆకుకూరలు తదితర వాటిని తీసుకు రావడం చాలా ఇబ్బంది పడుతున్నారు. పగలంతా తమ పొలాల వద్ద పండించిన పంటలను కోతలు కోసుకొని వాటిని బస్తాలలో బుట్టలలో నింపుకొని మార్కెట్కు తీసుకు రావడం చాలా ఇబ్బందిగా ఉంది కావున కరోనా వ్యాధి కంటె ముందు మార్కెట్ వేలం ఎలా నిర్వహించేవారో అలాగే కొనసాగించాలని కలెక్టర్‌ను కోరారు. కలెక్టర్ పరిశీలించి రైతులకు అనుకూలమైన సమయంలో వేలంపాట నిర్వహించే విధంగా చర్యలు తీసుకుంటామని రైతు సంఘం నాయకులకు హామీ ఇచ్చినట్లు చెప్పారు.

కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు డిమాండ్

విశాలాంధ్ర-పులివెందుల: పులివెందుల తాలూకా వేంపల్లి మండల కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న పాములూరు పెద్దరాయి బండ వద్ద సర్వే నెంబర్ 513 లోని కోట్లాది రూపాయలు విలువ చేసే ప్రభుత్వ భూమిని వేంపల్లి కు చెందిన టిడిపి నేత మాజీ జిల్లా కార్యదర్శి ఎద్దుల శేషారెడ్డి దాదాపు ఏడు ఎకరాలు పైగా ఆక్రమణ చేశారు. ఆక్రమణ చేసిన ప్రభుత్వ భూమిలో అక్రమంగా ఫైరు పెట్టారు పాములూరు గ్రామస్తుల గ్రామదర్శిని లో స్వయంగా వేంపల్లి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసిన ఏమాత్రం పట్టించుకోకుండా ఎమ్మార్వో చూసి చూడనట్టు వ్యవహరిస్తున్నారని సిపిఐ పులివెందుల ఏరియా సమితి ఆధ్వర్యంలో పులివెందుల ఆర్డీవో చిన్నయ్యకి ఫిర్యాదు చేయడం జరిగింది . ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కూడా ఫిర్యాదులు చేసిన వేంపల్లి రెవెన్యూ అధికారులు నిమ్మకు నిరెత్తనట్లు వ్యవహరిస్తు మామూళ్ల మత్తులో జోగుతున్నారని సిపిఐ పులివెందుల ఏరియా కార్యదర్శి వెంకట రాములు ఆవేదన వ్యక్తం చేశారు. వేంపల్లి మున్సిపాలిటీ అయితే ఆ భూమి మున్సిపాలిటీ పరిధిలోకి రావడమే కాకుండా కోట్లాది రుపాయల విలువ చేసేది గా మారుతుంది. భవిష్యత్ లో ప్రభుత్వ భవనాలు లేదా ఇతర వాటి నిర్మాణాలకు ఇంతకు మించిన అనువైన భూమి వేంపల్లి లో లేదు. రెవెన్యూ అధికారులపై కూటమి నేతలు ఒత్తిడి చేసి ప్రభుత్వ భూమి ఆక్రమణ కు సహకరిస్తున్నారు. తక్షణమే ఈ ప్రభుత్వ భూమి ని స్వాధీనం చేసుకోని బోర్డ్ ను ఏర్పాటు చేసి ప్రభుత్వ భూమి ని కాపాడాలి లేనియెడల అక్కడ ప్రభుత్వ భూమి ని ఇంటి నిర్మాణాల కోసం సిపిఐ ఆధ్వర్యంలో పేదలకు పంచే కార్యక్రమం జరుపుతామని హెచ్చరించారు కార్యక్రమంలో సిపిఐ సింహాద్రిపురం మండల కార్యదర్శి అమీర్ భాష నాయకులు బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విస్తరణ అధికారిగా పదోన్నతి పొందిన రామ్ చరణ్

విశాలాంధ్ర-మైదుకూరు : దువ్వూరు సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయ కుడిగా విధులు నిర్వర్తిస్తున్న నీలం రామ్ చరణ్ వ్యవసాయ విస్తరణ అధికారిగా దువ్వూరు మండలంలోని మాచనపల్లె క్లస్టర్‌కు పదోన్నతి పై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు వ్యవసాయ పరంగా రైతులకు ఏ అవసరం ఉన్న ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ఉత్తమ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించడానికి కృషి చేస్తానని చెప్పారు.

రామాలయం దేవస్థానం భూమిపూజలో ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలంలోని కల్లూరులో రామాలయం దేవస్థానానికి ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి అభ్యర్థన మేరకు రామాలయం దేవస్థానానికి రాష్ట్ర ప్రభుత్వం రూ. 30లక్షలు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో నంద్యాల భార్గవ్ రెడ్డి, టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, లింగాపురం ఏజీఆర్ బ్యాంక్ చైర్మెన్ సిద్ధారెడ్డి నాగమునిరెడ్డి, అరకటవేముల కృష్ణారెడ్డి, స్థానిక టీడీపీ నాయకులు నిరంజన్ రెడ్డి, నరసింహారావు, మునయ్య, వెంకట సుబ్బయ్య, యూ.శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గౌరీ పౌర్ణమి సందర్భంగా నేడు అన్నదానం

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: స్థానిక మైదుకూరు రోడ్డు లోని పెద్దమ్మ తల్లి గుడి వద్ద గౌరీ పౌర్ణమి సందర్భంగా నేడు మధ్యాహ్నం 12:30 గంటలకు అన్నదానం నిర్వహిస్తున్నట్లు టీడీపీ పట్టణ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అన్నదానంలో మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొనాలన్నారు.

ఎన్ఎస్ఎస్ యూనిట్ క్యాంప్ ప్రారంభం

విశాలాంధ్ర- ప్రొద్దుటూరు: ఎస్సీఎస్ఆర్ గవర్నమెంట్ డిగ్రీ(ఆర్ట్స్) కాలేజ్ ఎన్ఎస్ఎస్ యూనిట్-1 స్పెషల్ క్యాంప్‌ను కొత్తపల్లి గ్రామం మత్స్య కాలనీ లో ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణ, సామాజిక స్పృహ, నాయకత్వ లక్షణాలు, పర్యావరణం, వ్యాధులు, ఆహారం పట్ల అవగాహన కలిగి ఉండాలని తెలియజేశారు. అలాగే కొత్తపల్లి గ్రామ సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రా రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో చుట్టు ప్రక్కల ఉన్నటువంటి కలుపు మొక్కలను తీసి వేయాలని తెలిపారు. ఎన్ఎస్ఎస్ యూనిట్ పీఓ వెంకటరాముడు మాట్లాడుతూ విద్యార్థులు సమాజసేవ చేయాలని తెలియజేశారు. ఈ క్యాంపు వారం రోజుల పాటు మత్స్యకాలనీలో జరుగుతుందని, ఈ కార్యక్రమంలో విద్యార్థులు సిబ్బంది పాల్గొని జయప్రదం చేయాలని ప్రిన్సిపాల్ తెలియజేశారు.

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయిపై దాడికి ఖండన

ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ

విశాలాంధ్ర - పీలేరు : ఎంతటి ఉన్నత స్థాయిలో ఉన్న కుల వివక్షత వెంటాడుతూ ఉంటాది అనటానికి సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి గవాయిపై ప్రత్యక్షంగా తన చెప్పుతో దాడి చేయాలని ప్రయత్నించటం అనాగరికత , చదువుకున్న నిరక్షరాసుడు ఎంతటి అఘాయిత్యానికి పాల్పడటం దుర్మార్గం దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం అని ఎన్.ఎస్.యూ.ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు మద్దెల. అమృత్ తేజ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ దాడి రాజ్యాంగం మీద , భారత పార్లమెంట్ మీద , భారత అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టు మీద , ప్రజాస్వామ్యం మీద దాడిగా పరిగణించి , దాడికి ప్రయత్నించిన లాయర్ పై దేశద్రోహం కేసు పెట్టి బహిరంగంగా ఉరిశిక్ష వేయాలని డిమాండ్ చేశారు.

వ్యవసాయ పనిముట్లపై జీఎస్టీ తగ్గింపును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-రాయచోటి: ట్రాక్టర్లు, వ్యవసాయ అనుబంధ రంగాల పనిముట్లపై జీఎస్టీ తగ్గింపును రైతులందరూ వినియోగించుకోవాలని, అన్ని వర్గాల ప్రజలకు జీఎస్టీ 2.0 ద్వారా చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించేందుకే సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తోందని, రాష్ట్ర ప్రభుత్వం కోల్పోయే వేల కోట్ల రూపాయలు ప్రజలకు ఆదా అవుతుందని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం రాయచోటిలోని మార్కెట్ యార్డులో వ్యవసాయం, ఉద్యానవనం, పశుసంవర్ధకం రంగాలకు సంబంధించిన ట్రాక్టర్లు, డ్రిప్ ఇరిగేషన్ పరికరాలు, బయో పెస్టిసైడ్స్, ఫర్టిలైజర్లు, తదితర వస్తువులపై జీఎస్టీ 2.0 అమలు అనంతరం రైతులకు చేకూరే లబ్ధిపై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ఏర్పాటు చేసిన సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన ట్రాక్టర్ ర్యాలీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జీఎస్టీ 2.0 ద్వారా అన్ని వర్గాల ప్రజలకు చేకూరే లబ్ధిపై అవగాహన కల్పించేందుకు సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లుగా పేర్కొన్నారు. ఒక దేశం ఒక పన్ను అనే సిద్ధాంతంతో రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయంతో 2017లో జీఎస్టీని కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తరువాత అతిపెద్ద ఆర్థిక సంస్కరణ జీఎస్టీ 2.0 అని, దీని ద్వారా 99 శాతం వస్తువులకు ధరలు తగ్గుతాయని పేర్కొన్నారు. గతంలో 18 లేదా 12 శాతం జీఎస్టీ ఉన్న వస్తువులకు 5 శాతం లేదా 0 శాతం జీఎస్టీ అమలవుతుందన్నారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు లక్ష్మీ ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో నడపబడుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల సంక్షేమం కోసం జీఎస్టీ రేట్లు తగ్గించిందని తగ్గిన జీఎస్టీ రేట్లను ప్రజలందరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివ నారాయణ, వివిధ శాఖల జిల్లా అధికారులు, రైతులు, ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్‌లోనీరు నిల్వకుండా చర్యలు

టీడీఎంసీ సభ్యులు బోడేశ డియంకు వినతి

విశాలాంధ్ర - పీలేరు : పిలేరు ఆర్టీసీ బస్టాండ్ లో వర్షకాలంలో నీరు నిల్వతోప్రయాణికులు, డ్రైవర్లు, సిబ్బంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నీరు నిల్వతో బస్సుల్లో ఎక్కడం, దిగడం కష్టంగా మారుతోంది. అలాగే ఆ నీరు చెడలు, దుర్వాసనలకు కారణమవుతోంది. ఈ సమస్య ను గమనించి, డ్రైనేజ్ వ్యవస్థను మెరుగుపరచి నీరు నిల్వ కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ చర్యతో ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుంది. ఆర్టీసీ ప్రతిష్ట కూడా పెరుగుతుంది. ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో అనుకూలంగా ఇంకుడు గుంతలు కట్టినట్లయితే బస్టాండ్ చుట్టూ ఉన్న వీధుల్లో బోర్లు రీఛార్జ్ అవ్వడానికి అవకాశం ఉంటుందన్నారు.

సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోండి-ఎమ్మెల్యే

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక నెహ్రూ రోడ్డులోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో అనారోగ్య పరిస్థితులతో ప్రొద్దుటూరు నియోజకవర్గానికి చెందిన 99మంది లబ్దిదారులకు 49లక్షల 49వేల 44రూపాయలు ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విడుదలైన చెక్కులను, రాజుపాలెం మండలం లోని గాదెగూడూరు గ్రామానికి చెందిన గోన అభిషేక్ అనే లబ్ధిదారునికి 10లక్షల ఎల్ఓసిని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజల వైద్య ఖర్చుల నిమిత్తం సకాలంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులు, ఎల్ఓసీలు అందిస్తూ తాను న్నానని భరోసా కల్పిస్తున్న సీఎం చంద్ర బాబుకు ప్రజలందరూ అండగా ఉండాలని తెలిపారు. కూటమి ప్రభుత్వం పేద మేలు కోరే మంచి ప్రభు త్వం అని, కష్టకాలంలో అండగా నిలిచే మానవీయ ప్రభుత్వం అన్నారు. సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం లాంటిదన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఈవి సుధాకర్ రెడ్డి, వద్దిబాలుడు, ఘంటసాల వెంకటేశ్వర్లు, నూరి, కౌన్సిలర్ కమాల్ బాషా, సోమా బాలయ్య, లక్ష్మీపేట గురివిరెడ్డి, సానా వెంకట సుబ్బారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, సిద్దయ్య, శ్రీనివాసుల రెడ్డి, పగిడాల సుబ్బారెడ్డి, ఇట్టే సునీల్ పాల్గొన్నారు.

మండల రిసోర్స్ కార్యాలయం ప్రారంభం

విశాలాంధ్ర-కొండాపురం: మండల రిసోర్స్(విద్యా శాఖ) కార్యాలయం నూతన భవనం సోమవారం జమ్మలమడుగు టీడీపీ ఇంచార్జ్ భూపేష్ రెడ్డి, కొండాపురం మండల ఇంచార్జ్ శివనారాయణ రెడ్డిలు ప్రారంభించారు. గండికోట ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల కొండాపురంలోని కార్యాలయం ముంపునకు గురి కావడంతో కొండాపురంలోని గ్రామ సచివాలయంల సమీపంలో విద్యాశాఖ-సమగ్ర శిక్ష నిధులతో సుమారు 53లక్షల రూపాయలతో నూతన భవనం నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ అధికారి-1 ఓబులేసు, మండల విద్యాశాఖ అధికారి-2 రామలయ్యల ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికారు. అదేవిధంగా జూనియర్ కాలేజీకి నూతన భవనాలు నిర్మాణం చేసేలా చర్యలు తీసుకోవాలని కాలేజి ప్రిన్సిపాల్, లెక్చరర్లు కలిసి భూపేష్ రెడ్డి, శివనారాయణ రెడ్డిలకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు నాగేశ్వర రెడ్డి, బీజేపి మండల అధ్యక్షులు బాల నాగిరెడ్డి, రెండెద్దుల రామాంజనేయ రెడ్డి, శంకర్ రెడ్డి, బాబుల్ రెడ్డి, కొండాపురం బుజ్జి, చామల పద్మజ, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

మంద కృష్ణ మాదిగ పర్యటన విజయవంతం చేయండి

విశాలాంధ్ర - పీలేరు : పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ ఈనెల 16వ తేదీన అన్నమయ్య జిల్లాకు విచ్చేయుచున్నారని ఈ పర్యటన విజయవంతం చేయాలని ఎంఆర్‌పిఎస్ అన్నమయ్య జిల్లా ఇంచార్జ్ కోట డానియల్ మాదిగ, జిల్లా అధ్యక్షులు యర్రంవారి పల్లి రవీంద్ర మాదిగ తెలిపారు. సోమవారం పీలేరులో స్థానిక ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో సమీక్ష సమా వేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని మండల గ్రామ కమిటీలు నిర్మాణాన్ని బలోపేతం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో విహెచ్‌పిఎస్ ఇంచార్జ్ రామ మోహన్ రెడ్డి, వీహెచ్పీఎస్ నాయకులు వెంకటేష్,అమర్నాథ్ రెడ్డి, పీలేరు నియోజకవర్గం కో ఇన్చార్జ్ ముల్లంగి రెడ్డప్ప, కె.వి పల్లి మండలం అధ్యక్షులు రాము, యూత్ ప్రెసిడెంట్ రాజేష్, సీనియర్ నేతలు వెంకట రమణ, కలకడ మండలం ఎమ్మార్పీఎస్ అధ్యక్షులు వంగిమల హరినాథ్, ఎమ్మెస్ పి నాయకులు వర్ల రెడ్డయ్య, పీలేరు మండల అధ్యక్షులు గండికోట రెడ్డి కుమార్, సీనియర్ నాయకులు వెంకటరమణ, జీఎం రమణ,యువ నాయకులు అన్నవరం, చంద్రయ్య, కలికిరి మండలం అంజి, ఎం ఈ ఎఫ్ రవి ఈశ్వరయ్య పాల్గొన్నారు.

గండికోట ముంపు నిర్వాసితులకు న్యాయబద్ధంగా పరిహారం, పునరావాసం : కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

- సమస్యలన్నింటికీ పూర్తిస్థాయిలో పరిష్కరిస్తాం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: గండికోట జలాశయ నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని, న్యాయబద్ధమైన పరిహారం అందించేందుకు కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాల్ నందు గండికోట జలాశయం ముంపు గ్రామస్తులకు పునరావసం, పరిహారం, మౌలిక సదుపాయాలు కల్పించే అంశమై.. జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జేసీ అదితి సింగ్, ఆర్డీవో సాయిశ్రీ, ఎస్డీసిలు శాంతమ్మ, నీలమయ్య లతో కలిసి గ్రామస్తులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గండికోట రిజర్వాయర్ లో పూర్తిస్థాయిలో నీటిని నిల్వచేసి జిల్లాను సస్యశ్యామలం చేయడం జరిగిందన్నారు. జిల్లాలో అన్ని రకాల నీటి అవసరాలను తీర్చే దిశగా ప్రభుత్వం చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో భాగంగా నీటి నిల్వ సామర్థ్యం పెంపుదల విషయంలో మరికొన్ని గ్రామాలు ముంపునకు గురి కావడంతో.. ఆయా గ్రామస్థులకు కూడా పరిహారం, పునరావాసం కల్పించడంలో భాగంగా వివిధ దశల్లో పరిహారం, పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అందుకు సంబంధించి నివాస గృహాలను లబ్ధిదారులకు వారి పేరుతో ధృవీకరణ, రిజిస్ట్రేషన్ చేయించి అందించేందుకు తక్షణమే చర్యలు చేపడుతామన్నారు.గండికోట నిర్వాసిత గ్రామస్తులకు పునరావాసం, పరిహారం కల్పన విషయంలో.. 2019, 2023 వరకు కూడా చాలా వరకు పరిహారం అందించడం జరిగిందని, కొండాపురం నమండలంలోని ఇంకా 3 గ్రామాలకు పరిహారం అందాల్సి ఉందన్నారు. మొత్తం 22 గ్రామాల వరకు ముంపునకు కూరయ్యాయని, వారందరికీ పరిహారం, పునరావాసం కూడా కల్పించడం జరిగిందన్నారు. మొత్తం 26 పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పునరావాసం కల్పించడంలో కొన్ని అంశాలు ఇంకా పెండింగ్ లో ఉన్నాయన్నారు. ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ప్రకారం అందాల్సిన పరిహారం నిధులు, పునరావాస కల్పనలో భాగంగా పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలను కల్పించడంలో పూర్తి స్థాయిలో పనులను చేపట్టాల్సి ఉందన్నారు. అంతే కాకుండా సామాజిక, ఆర్థిక సర్వే విషయంలో కూడా పూర్తిస్థాయిలో వివరాలు అందాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గండికోట పునరావాస గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, ఉద్యోగ ఉపాధి అవకాశాలపై ప్రత్యేక దృష్టి సారిస్తోందన్నారు. జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి మాట్లాడుతూ.. అంతేకాకుండా గండికోట రిజర్వాయర్ కోసం భూములు, ఇళ్లను కోల్పోయిన నిర్వాసితులకు రాష్ట్ర ప్రభుత్వం ఎల్లవుడు వెన్నంటే ఉంటుందన్నారు. పునరావాస కాలనీల్లో అన్నిరకాల మెరుగైన మౌలిక వసతులు కల్పించడం జరుగుతోందన్నారు. రానున్న రోజుల్లో ఈ ప్రాంతంలో విస్తృతమైన ఉపాధి, ఉద్యోగ అవకాశాలు అందేలా ప్రాజెక్టులు రానున్నాయన్నారు. అనంతరం ముంపు గ్రామాలకు సంబంధించి సమస్యలపై ఆయా గ్రామస్తుల నుండి జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు అర్జీలను స్వీకరించారు. ఎర్రగుంట్ల మండలం హనుమనగుత్తి పునరావాస గ్రామంలో స్మశానవాటిక లేక నానా అవస్థలు పడుతున్నామని పలువురు తెలిపారు. కొండాపురం మండలంలో పాఠశాల, జూనియర్ కళాశాలకు స్థలం, భవనాల నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కళాశాల ప్రిన్సిపాల్.. జిల్లా కలెక్టర్ ను కోరారు. అలాగే.. దత్తాపురం పునరావాస గ్రామంలో చాలా స్థలాలు ఆక్రమణలకు గురవుతున్నాయని.. ప్రభుత్వ స్థలాలను పరిరక్షించాలని, ఆలయాలను పునర్నించాలని, కొంతమందికి పరిహారం పంపిణీ కూడా పెండింగ్ లో ఉందన్నారు. ఈ సందర్భంగా ఫేస్-1, ఫేస్.2, ఫేస్ -3, ఫేస్ -4 కింద పునరావాసం కల్పించిన గ్రామాల్లో పెండింగ్ లోవున్న ప్యాకేజీ సమస్యను పరిష్కరించాలని పలువురు నిర్వాసిత గ్రామస్తులు వివిధ రకాల సమస్యలను జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఆర్ అండ్ బి, పీఆర్, హౌసింగ్ సంబందిత శాఖల అధికారులు, నిర్వాసిత గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన కాంగ్రెస్ : ఇర్ఫాన్ బాష

విశాలాంధ్ర-ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ఇంటింటి ప్రచార కార్యక్రమం ప్రభావవంతంగా ముందుకు సాగుతోంది. పట్టణంలోని స్థానిక శ్రీనివాస్ నగర్లో సోమవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ఇర్ఫాన్ బాష నేతృత్వంలో సంతకాల సేకరణ నిర్వహించారు. కేంద్ర యువనేత రాహుల్ గాంధీ, ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిలా రెడ్డి పిలుపుమేరకు ఈ ప్రచారాన్ని చేపట్టినట్లు ఇర్ఫాన్ బాష తెలిపారు. ప్రజాస్వామ్య పరిరక్షణే నిజమైన దేశసేవ అన్న ఆలోచనతో ప్రజల్లో అవగాహన పెంచేందుకు, ఓటర్ల హక్కుల పరిరక్షణకై స్పష్టమైన సందేశం ఇవ్వడమే లక్ష్యమని ఆయన వివరించారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాష మాట్లాడుతూ ప్రజాస్వామ్యం అంటే ప్రజల స్వరం. కానీ నేటి పాలనలో ఆ స్వరం వినిపించకుండా చేస్తున్నారని, ఎన్డీఏ కూటమి అధికారం చేపట్టిన తర్వాత మధ్య తరగతి, బడుగు, బలహీన వర్గాల జీవితం భారమైందని, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరగడంతో కుటుంబాలు కష్టాల్లో కూరుకుపోతున్నాయని అన్నారు. ప్రజలు తమ ఇబ్బందులను నేరుగా కాంగ్రెస్ శ్రేణులకు చెబుతున్నారని, ఈ సమస్యలు కేవలం ప్రొద్దుటూరుకే కాకుండా దేశవ్యాప్తంగా ప్రజలను వేధిస్తున్నాయి అని ఆవేదన వ్యక్తం చేవారు. అలాగే ఓటర్ల జాబితాలో జరుగుతున్న అవకతవకలు ప్రజాస్వామ్యానికి తీవ్రమైన ముప్పు అని, నిజమైన ఓటర్ల పేర్లు తొలగించడం, నకిలీ ఓట్లను చేర్చడం వంటి చర్యలు ప్రజల హక్కులను హరించే వాటే ప్రజల గళం వినిపించే ఏకైక వేదిక కాంగ్రెస్ పార్టీనే అన్నారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలు ఓటు దొంగ-గద్దె దిగు నినాదాలతో ప్రజల్లో అవగాహన కల్పించారు. ప్రజల నుంచి సంతకాలు సేకరించి, ఎన్నికల వ్యవస్థలో జరుగుతున్న అక్రమాలను అరికట్టడంలో ప్రజల భాగస్వామ్యాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు సాధారణ ప్రజల జీవితాలపై ప్రతి కూట ప్రభావం చూపుతున్నాయి అన్నారు. పెరుగుతున్న ధరలు, ఉద్యోగ రాహిత్యం, విద్య, వైద్యం, ఖర్చులు, మధ్య తరగతి కుటుంబాలపై భారమైపోతున్నాయి అన్నారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం ప్రతి పౌరుడి బాధ్యత అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు గోసంగి సుబ్బారెడ్డి, డీసీసీ సెక్రటరీ అప్పపోగుల ఎల్లయ్య, గౌస్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రాణాలు పోయినా టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచనీయం

పరిహారం పక్కా అయితేనే ముందుకు యురేనియం అధికారుల మాటలను నమ్మం

కే కే కొట్టాల గ్రామస్థులు

విశాలాంధ్ర - వేముల : వేముల మండలం కేకే కొట్టాల గ్రామ సమీపంలో ఉన్న టైలింగ్ పాండ్ విస్తరణ పనులను ప్రాణాలు పోయినా లెక్కచేయకుండా నిలిపివేస్తామని కేకే కొటాల గ్రామస్తులు తెలియజేశారు. గ్రామ సమీపం లో ఉన్న టెయిలింగ్ పాండ్ గేటు వద్ద గ్రామస్థులు అందరూ నిరసన వ్యక్తం చేశారు 2017 నుంచి ఇప్పటి వరకు యురేనియం అధికారుల మాటలు విని విని విసిగిపోయామని వారి మాటల్లో ఎలాంటి వాస్తవాలు లేవని పేర్కొన్నారు ఇదే మొదట యురేనియం ప్లాంట్ ఏర్పాటు ముందు ఒకలాగా సంస్థ ఏర్పాటు అయిన తర్వాత మరొక లాగా అధికారుల మాట తీరు ఉందని గ్రామస్తులు ఆరోపించారు కల్ల బొల్లి మాటలు మాట్లాడి వారి పని పూర్తి చేసుకుంటే మళ్ళీ మా గోడు వినే వాళ్ళు ఉండరు అని వాపోయారు మొదట ఏర్పాటు చేసిన టెయిలింగ్ పాండ్ వల్ల సర్వము కోల్పోయాం అని ప్రస్తుతం ఉన్న టెయిలింగ్ పాండ్ ఎత్తు పెంచాలి అనుకుంటే తప్పని సరిగా మా గ్రామం లో ఉన్న భూములు తీసుకుని వాటికి ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లించి పునరావాసం కల్పిస్తూ ఉద్యోగం ఇవ్వాలి గ్రామస్తులు డిమాండ్ చేశారు. లేదంటే ప్రాణత్యాగం అయినా సిద్ధంఅని వారు తెల్పారు. ఎలాంటి అవాంఛన సంఘటనలు జరగకుండా వేముల మండల ఎస్ ఐ ప్రవీణ్ కుమార్ తమ సిబ్బంది తో సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

అకాల వర్షంతో - ఆర్టీసీ గ్యారేజ్, ఫారెస్ట్ ఆఫీస్ జలమయం

విశాలాంధ్ర - బద్వేలు : బద్వేల్ పట్టణంలో కురిసిన అకాల వర్షం ప్రజలకు ఇబ్బందులు కలిగించింది. ఆర్టీసీ గ్యారేజ్, ఫారెస్ట్ ఆఫీస్ పరిసరాలు జలమయమై రహదారులు మునిగిపోయాయి. ఈ పరిస్థితిని గమనించిన రెవెన్యూ డివిజనల్ అధికారి ఏ.చంద్రమోహన్ స్వయంగా ప్రాంతాలను పరిశీలించారు. ఆయనతో పాటు తహసిల్దార్లు ఉదయ్ భాస్కర్ రాజు, శ్రీభువన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పర్యటించారు. నీరు ఇళ్లలోకి చేరకుండా, రహదారులపై నిల్వ కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులు సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

వడ్డే ఓబన్నకు మున్సిపల్ చైర్మన్ నివాళి

విశాలాంధ్ర - పులివెందుల : పులివెందుల లో స్థానిక శ్రీశ్రీ కేఫ్ నందు భారత స్వాతంత్ర సమరయోధులు వడ్డే ఓబన్న వర్ధంతి సందర్భంగా పూలమాలతో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ వల్లెపు వరప్రసాద్ ఘన నివాళు లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర సంగ్రామంలో బ్రిటిష్ వారిని ఎదిరించి గెరిల్లా యుద్ధ తంత్రంతో బ్రిటిష్ సైన్యాలను గడగడలాడించిన వీరుడని కొనియాడారు. ఆనాటి సమాజ గమనంలో ఎన్నో విజయాలను అందించి అసువులు బాసిన అయన చిర స్మరణీయులు అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పులివెందుల వడ్డెర సంక్షేమ సంఘం సభ్యులు వెంకటరమణ వెంకటస్వామి, ప్రశాంత్ లోకేష్, అమర్, మోహన్ శివరాజ్ తదితరులు పాల్గొన్నారు.

రాస్తా కబ్జాపై తహశీల్దార్‌కు రైతు ఫిర్యాదు

విశాలాంధ్ర-సిద్దవటం : పంట పొలాల్లోకి వెళ్లే రాస్తాను కబ్జా గురైందని మండల కేంద్రమైన సిద్దవటం తాసిల్దార్ కార్యాలయంలో రైతు ఫిర్యాదు చేశారు. సిద్దవటం రెవెన్యూ సర్వేనెంబర్ 3/2లో 30 సెంట్లు స్థలంలో రైతులు పంట పొలాల్లోకి వెళ్లేందుకు అధికారులు రహదారిని నిర్ణయించారని సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో రైతు సిద్దయ్య మండల తాసిల్దార్ ఆకుల తిరుమల బాబుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా రైతు సిద్దయ్య మాట్లాడుతూ ఓబుల్ రెడ్డి అనే వ్యక్తి తన పొలం ఆనుకొని ఉన్న రాస్తాను జెసిబి యంత్రంతో తవ్వకాలు జరిపి రైతులు పొలాల్లోకి వెళ్లకుండా అన్యాక్రాంతం చేశాడని గతంలో 30 సెంట్లు స్థలాన్ని అధికారులు రహదారిగా గుర్తించారని అతనిపై చర్యలు తీసుకొని రైతులు పొలాల్లోకి వెళ్లేందుకు దారిని ఏర్పాటు చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం

విశాలాంధ్ర - కడప : కడప నగర వినాయక నగర్ సర్కిల్ సమీపంలో దుర్మరణం చెందాడు. ఈ విషయం తెలిసిన వెంటనే కడప ట్రాఫిక్ సిఐ డి.కే.జావీద్ తమ సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. వల్లూరు మండలం బీచ్ వారి పల్లి గ్రామానికి చెందిన ఇరగబోయిన రామ్మోహన్ (39) కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. 14 ఏళ్ల క్రితం ఆయనకు వివాహం కాగా భార్య, ఇరువురు ఆడబిడ్డలు ఉన్నారు. ఉదయం ఉదయం 11:30 గంటలకు ఇంటి నుంచి కడపకు ద్విచక్ర వాహనంలో బయలుదేరారు. వినాయక నగర్ జంక్షన్ సమీపం కు రాగానే, రోడ్డు ప్రక్కన ఆగి ఉన్న బస్సును ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీ తరలించి మృతుడి సోదరుడు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు తెలిపారు.

సంక్షిప్త వార్తలు

కార్మికులను తొలగిస్తే ఉద్యమిస్తాం

విశాలాంధ్ర-కడప: ఆర్‌సిపి రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి. రిమ్స్ నందు నూతనంగా శానిటేషన్, సెక్యూరిటీ ఏజెన్సీ బాధ్యతలను చేపట్టనున్న ఓ ప్రైవేట్ సంస్థ ఇందులో పని చేస్తున్న కార్మికులను తొలగించాలని చూస్తుందని, 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న కార్మికులను తొలగించటం కార్మిక చట్ట వ్యతిరేకమని దానిని ఏమాత్రం సహించబోమని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిశంకర్ రెడ్డి హెచ్చరించారు. సోమవారం రిమ్స్ నందు కార్మికులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రిమ్స్ నందు పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్ట ప్రకారం వేతనాలు అందడం లేదని, అందులోను కూడా ఈఎస్ఐ, పిఎఫ్ లలో గోల్మాల్ జరుగుతున్నాయని, నెలనెలా వేతనాలు అందించడంలో తీవ్ర జాప్యం నెలకొంటుందని, కార్మికులకు సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, కోరారు.

టిడిపి కార్యకర్తకు నివాళి

విశాలాంధ్ర-సంబేపల్లె: మండలంలోని గురిగింజకుంట గ్రామం నాయునివారిపల్లెకు చెందిన టిడిపి కార్యకర్త గురిగింజకుంట వెంకటాద్రి నాయుడు పార్థివ దేహానికి సోమవారం రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు నివాళులర్పించారు. వెంకటాద్రి నాయుడు ఆదివారం స్కూటర్‌లో వెళ్తూ రోడ్డు ప్రమాదంలో గాయపడి తిరుపతి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించిన విషయం తెలుసుకుని వారి స్వగ్రామానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులర్పించి అంత్యక్రియల్లో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ప్రసాద్ బాబు మాట్లాడుతూ టిడిపి సీనియర్ కార్యకర్తను కోల్పోవడం చాలా బాధాకరమన్నారు వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. టిడిపి ఆవిర్భావం నుండి మృతుడి నాన్న మల్లయ్య నాయుడు పార్టీలో సీనియర్ నాయకులుగా కొనసాగారన్నారు. టిడిపి అభ్యర్థుల విజయంలో వీరి కుటుంబం కీలకమన్నారు.

శివారెడ్డికి ఉత్తమ పురస్కారం

విశాలాంధ్ర-వేంపల్లి: వేంపల్లి ఉషా కిరణ్ ఉన్నత పాఠశాలలో 33 సంవత్సరాలుగా గణిత ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కల్లూరు శివారెడ్డికి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం లభించింది. కడప జిల్లా గుర్తింపు పొందిన ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం ఆధ్వర్యంలో ప్రొద్దుటూరులో నిర్వహించిన కార్యక్రమంలో పట్టభద్రుల శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి దుశ్శాలువ జ్ఞాపికతో సత్కరించారు. శివారెడ్డికి పురస్కారం లభించడం పట్ల కరస్పాండెంట్ రమణారెడ్డి, ఉపాధ్యాయ బృందము, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. పాఠశాల వ్యవస్థాపకులు గుజ్జుల కృష్ణారెడ్డి, జిల్లా అధ్యక్షులు బివి రమణారెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు పి నాగేశ్వరరావు, మదన్మోహన్ రెడ్డి, చార్లెస్‌లు పాల్గొన్నారు.

బోధకులు నిరంతరం పరిశోధన దృష్టితో ముందుకెళ్లాలి

విశాలాంధ్ర-రాయచోటి: అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి శ్రీసాయి ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం ఐదు రోజులపాటు నిర్వహించనున్న ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రాం (ఎఫ్ డిపి)ను ఘనంగా శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథిగా డాక్టర్ సి.హెచ్. రత్నకుమారి, ప్రొఫెసర్, ట్రిబుల్ ఐటీ ఆర్కే వ్యాలీ హాజరై విలువైన సూచనలు అందించారు. అలాగే విశిష్ట అతిథిగా డాక్టర్ జివిన్ వివేకానంద పాల్గొని ఉపాధ్యాయుల అభివృద్ధి, ప్రాధాన్యతపై వివరణాత్మకంగా ప్రసంగించారు. ఈ సందర్భంగా డాక్టర్ సిహెచ్ రత్నకుమారి నేటి విద్యా వ్యవస్థలో బోధన విధానాలు వేగంగా మారుతున్నాయని, ఫ్యాకల్టీ సభ్యులు సాంకేతికతతో పాటు సృజనాత్మకతను కలగలిపి విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని సూచించారు. డాక్టర్ జివిన్ వివేకానంద మాట్లాడుతూ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ ప్రోగ్రామ్స్ ద్వారా ఉపాధ్యాయులు కొత్త బోధనా విధానాలు, పరిశోధనాపరమైన దృక్కోణం, ఆవిష్కరణాత్మక ఆలోచనా పద్ధతులు నేర్చుకోవచ్చని చెప్పారు. ఈ విధమైన కార్యక్రమాలు విద్యా సంస్థల్లో అకడమిక్ నాణ్యతను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. కళాశాల అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ ఎం.సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ, కళాశాల యజమాన్యం ఫ్యాకల్టీ విద్యార్థుల ప్రగతిని దృష్టిలో ఉంచుకుని, ఇలాంటి సమగ్ర అభివృద్ధి కార్యక్రమాలను కొనసాగిస్తోందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.వెంకటరమణ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి యూనివర్సిటీ ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్ ద్వారా నిధుల మంజూరుకు సహకరించిన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ హెచ్.సుదర్శన్ రావుకి, యూనివర్సిటీ రిజిస్టర్ ప్రొఫెసర్ కృష్ణయ్యకి, ఫ్యాకల్టీ డెవలప్మెంట్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ ప్రశాంతికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల హెడ్‌లు, ఫ్యాకల్టీ సభ్యులు పాల్గొని చురుకుగా స్పందించారు. కార్యక్రమాన్ని సమన్వయకర్త డాక్టర్ ఏ.నరేష్ సమన్వయం చేశారు. వివిధ ఇంజనీరింగ్ కళాశాల నుండి సుమారు 38 మంది అధ్యాపకులు హాజరయ్యారని తెలియజేశారు.

బాణాసంచా గోడౌన్‌ను తనిఖీ చేసిన సీఐ

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: సీఐ శ్రీనివాసులు, ఎస్ఐ కొండా రెడ్డి సోమవారం మండలంలోని టపాసుల అమ్మకం కేంద్రాలు, గోడౌన్‌లను తనిఖీ చేయడం జరిగింది. సీఐ, ఎస్ఐ ఫైర్ క్రాకర్స్ షాపులు, గోదాముల యజమానులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. అన్ని పటాకుల షాపులు లైసెన్స్ పొందిన ప్రదేశాలలోనే ఏర్పాటు చేయాలి. గోదాములు జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాలలో ఉండరాదు. షాపుల వద్ద ఫైర్ ఎక్స్టింగ్విషర్, ఇసుక బకెట్లు, నీటి బారెల్లు తప్పనిసరిగా ఉంచాలి. షాపులలో విద్యుత్ వైరింగ్ సురక్షితంగా ఉండాలి. ధూమపానం (స్మోకింగ్), మంటలు వెలిగించడం, మొబైల్ ఉపయోగం ఖచ్చితంగా నిషేధం. షాపుల వద్ద బ్యానర్లు, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. గోదాములలో షాపుల వద్ద సురక్షిత దూరం పాటించాలి. ఫైర్ సర్వీస్, పోలీస్, రెవెన్యూ శాఖల అనుమతి లేకుండా పటాకుల నిల్వ, విక్రయం చేయరాదు. చిన్న పిల్లల చేత పటాకుల నిర్వహణ జర గకుండా యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

వైభవంగా శరన్న నవరాత్రుల మహోత్సవం ముగింపు

విశాలాంధ్ర-బ్రహ్మంగారిమఠం: శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో శరన్న రాత్రుల మహోత్సవము అంగరంగ వైభవంగా 22 నుండి మూడో తేదీ వరకు అంగరంగ వైభవంగా నిర్వహించారు. నూతన ఆలయ కమిటీ అధ్యక్షులుగా, అయ్యాను వెంకట సురేష్ బాబు ఆధ్వర్యంలో కమిటీ సభ్యులతో, అర్యవైశ్య పెద్దలు సలహాలతో ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు వివిధ రకాల అలంకరణతో పాటు అన్నదాన కార్యక్రమాలను చేపట్టారు ఆలయ నూతన అధ్యక్షులు పేర్కొన్నారు అందులో భాగంగానే పలువురు రాజకీయ నేతలు సన్మానించారు వివిధ రకాల సన్మాన కార్యక్రమాలను ఏర్పాటు చేయడం జరిగిందని ఆయన తెలిపారు రాబోయే రోజుల్లో వాసవి కన్యక పరమేశ్వరి ఆలయంలో శరన్న రాత్రుల మహోత్సవము అంగరంగ వైభవంగా నిర్వహించారు పెద్దలు సలహాల సూచనలతో ముందుకు పోతామని వారు తెలిపారు ఈ ఉత్సవాలకు విజయవంతం కావడానికి అర్య వైశ్య కుటుంబ సభ్యులు పెద్దలు అందరి సలహాలతోనే ఇంత విజయవంతం చేశామని వారు తెలిపారు. మాజీ అధ్యక్షులు, బస్సూరు కృష్ణమూర్తి అవోపాకమిటీ కమిటీ సీనియర్ నాయకులు ముచ్చర్ల శేషయ్య, అర్యవైశ్య కమిటీ కార్యదర్శి, సుంకు సురేష్ కోశాధికారి, దుగ్గిశెట్టి, వెంకటేశ్వర్లు, యువజన సంఘం అధ్యక్షులు యాదాళ్ళ వెంకటసుబ్బయ్య మహిళా మండలి కమిటీ అధ్యక్షురాలు పబ్బతి లక్ష్మీదేవి, అర్య వైశ్య పెద్దలు, అవోప కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పేదలకు వరం సిఎం రిలీఫ్ ఫండ్: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-రైల్వేకోడూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం అని ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్, కడప కుడ అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ ఛైర్మన్ తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ ముక్కా రూపానందరెడ్డి తనయులు యువ నాయకులు ముక్కా సాయివికాస్ రెడ్డి పేర్కొన్నారు. చిట్వేల్ మండలంలోని నాగవరం హరిజనవాడ గ్రామానికి చెందిన అలిశెట్టి మల్లిఖార్జునకు 51,310, పెద్దూరు గ్రామానికి చెందిన బుంగటావుల రామచంద్రయ్య కు 65,918, చెర్లోపల్లి గ్రామానికి చెందిన కోట భాను ప్రకాష్ మరణించడంతో ఆయన భార్య కు 1,09,660, చిట్వేల్ టౌన్‌కు చెందిన తుమ్మలపల్లి జయరామయ్య మరణించడంతో కుటుంబ సభ్యులకు 2,53,518 రూపాయల చెక్ లను తీసుకుని స్వయంగా భాధితుల నివాసాలకు వెళ్లి ఆప్యాయంగా పలకరించి చెక్ లను అందజేసి వారిలో సంతోషాన్ని నింపారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ వైద్యం పరంగా ఆర్థిక ఇబ్బందులు పడేవారికి సిఎం రిలీఫ్ ఫండ్ భాదితులకు కొండంత అండ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు బత్తిన వేణుగోపాల్ రెడ్డి, సింగమాల విశ్వనాధ రెడ్డి, మహేంధర్ రెడ్డి, మల్లిఖార్జున రెడ్డి, సర్పంచ్ గుత్తి నరసింహులు, స్థానికులు పాల్గొన్నారు.

అన్ని మతాలను సమానంగా చూసేది కాంగ్రెస్ ఒక్కటే

- కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి విజయ జ్యోతి



.విశాలాంధ్ర-కడప కలెక్టరేట్: అన్ని మతాలను సమానంగా చూసే పార్టీ కాంగ్రెస్ పార్టీ ఒక్కటే అని కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు ఎన్.డి.విజయ జ్యోతి అన్నారు సోమవారం కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ సెప్టెంబర్ 15 నుంచి అక్టోబర్ 15 వరకు జరిగే సంతకాల సేకరణ కార్యక్రమం జయప్రదంగా జరుగుతుందని మరియు ప్రజల నుంచి మంచి స్పందన రావడం ఆనందంగా ఉందని ఆమె పేర్కొన్నారు. అందులో భాగంగా ఈనెల 10వ తేదీ న ఏఐసీసీ సెక్రెటరీ గణేష్ కుమార్ యాదవ్ గారు మరియు సౌత్ జోన్ వర్కింగ్ ప్రెసిడెంట్,ఎక్స్ ఎమ్మెల్యే మస్తాన్ వల్లి కడపకు విచ్చేసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో సమావేశం నిర్వహించి ఓట్ చోరీ కార్యక్రమంలో పాల్గొంటారన్నారు. కాంగ్రెస్ పార్టీ కులమతాలకు అతీతంగా ప్రజల క్షేమం కోసం పోరాడే పార్టీ అని ముఖ్యమంత్రి వ్యాఖ్యలు హిందూ వ్యతిరేక విమర్శల్లో దళితవాడల్లో 5,000 గుడిలు కట్టిస్తామన్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యలపై రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి, కాంగ్రెస్ పార్టీ హిందువుల వ్యతిరేకి అని తప్పుడు ప్రచారం చేస్తున్నారని షర్మిలా రెడ్డి ఉద్దేశం దేవాలయాలు కట్టడానికి ముందు, దళితులకు కావాల్సిన ప్రాథమిక సౌకర్యాలైన ఇళ్లు, రోడ్లు, నీళ్లు, విద్యుత్తు, వైద్య సౌకర్యాలు కల్పించాలని అంతే కాకుండా ప్రజలకు ఇచ్చిన హామీలు సూపర్ సిక్స్ పథకాలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతులకు గిట్టుబాటు ధరలు, రాయితీలు వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కడప జిల్లా ఉపాధ్యక్షుడు సిరాజుద్దీన్ , కడప జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రెటరీ సయ్యద్ గౌస్ పీర్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు విజయ్ కుమార్, రాష్ట్ర మైనార్టీ జనరల్ సెక్రెటరీ మైనుద్దీన్,రాష్ట్ర మైనార్టీ ఉపాధ్యక్షుడు రఫీక్ ఖాన్, డివిజన్ ఇంచార్జ్ ముబారక్ భాషా, సిద్దిక్, హుస్సేన్, యూనిస్ ,జాహూర్ తదితరులు పాల్గొన్నారు.

బాధిత రైతులకు న్యాయం చేస్తాం

- మాది రైతు ప్రభుత్వం: చమర్తి - వర్షానికి దెబ్బతిన్న వరి పైర్ల పరిశీలన

విశాలాంధ్ర-సిద్దవటం: అకాల వర్షానికి దెబ్బతిన్న వరి పైర్లను టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు పరిశీలించారు. బాధిత రైతులకు న్యాయం చేస్తామని రైతులకు భరోసా కల్పించారు. మండలంలోని లింగంపల్లి, కడ పాయపల్లె గ్రామాలలో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి దెబ్బతిన్న వరి పైర్లను సోమవారం చమర్తి పరిశీలించారు. ప్రభుత్వ పరంగా అందాల్సిన సాయాన్ని అందించేలా చొరవ తీసుకుంటామని అక్కడి రైతులకు భరోసా కల్పించారు. 107 కుటుంబాల రైతులకు నష్టపరిహారం వచ్చే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ మహమ్మద్ రఫీ, ఏవో రమేష్ రెడ్డి, ఏఈఓ ప్రభాకర్ రెడ్డి, రాష్ట్ర దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ డాక్టర్ వీరభద్రుడు, నాయకులు ముద్దు కృష్ణారెడ్డి, మోహన్ రెడ్డి, దశరథ నాయుడు, చలమయ్య యాదవ్, నరసింహారెడ్డి, నాగముని రెడ్డి, వెంకటేశ్వర్లు, ప్రతాప్ నాయుడు, పాలకొండయ్య, పుత్త బాబు, పిచ్చిరెడ్డి, శంకర్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ జిల్లా సమీక్ష సమావేశం

విశాలాంధ్ర-పోరుమామిళ్ల రూరల్: కడప జిల్లా, బి.కోడూరు మండలం నందు కడప జిల్లా ఎంఆర్‌పిఎస్ అనుబంధ సంఘాల సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమీక్ష సమావేశంకు ఎంఆర్‌పిఎస్ కడప జిల్లా అధ్యక్షులు వెంకటేష్ సభ అధ్యక్షత వహించగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కడప జిల్లా ఇంచార్జ్ గుండాల ఈశ్వరయ్య మాదిగ పాల్గొని మాట్లాడుతూ పద్మశ్రీ మంద కృష్ణ మాదిగ ఆంధ్రప్రదేశ్ పర్యటనలో భాగంగా ఈ నెల 15వ తేదీన కడప జిల్లా సమావేశం కడపలోని రాజేశ్వరీ కళ్యాణ్ మండపం సమావేశం నందు జరుగుతుంది. ఈ సమావేశంలో కడప జిల్లాలోని ప్రతి గ్రామమునందు ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మెలను. ఎమ్మార్పీఎస్ మరియు అనుబంధ సంఘాల నూతన కమిటీలను వేగవంతం చేయాలని జిల్లా మండల ఇన్చార్జిలకు తెలియజేశారు.అలాగే ఈ నెల 15వ తేదీన కడప జిల్లాలో జరిగే జిల్లా సమీక్ష సమావేశంను విజయవంతం చేయాలని కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. నాయకులు గంగరాజు, నరసింహులు, జయచంద్ర, గురయ్య, నరసయ్య, సుబ్బయ్య, యాగప్ప, రామచంద్రయ్య పాల్గొన్నారు.